



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 64 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం బుధవారం 18 మార్చి 2026 వెల : 5/-రూ ॥
VOLUME :1 ISSUE : 64 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM WED 18 MARCH 2026 PRICE : 5/- RS
Simultaneously Published form Srikakulam,Ongole, Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## పనిచేసే సామర్థ్యం ఉన్నా దేశంలో 40% పట్టభద్రులకు ఉద్యోగాలు లేవు

- దేశంలో నిరుద్యోగ సమస్యపై కీలక నివేదిక రిలీజ్
- పట్టభద్రులు చదువు పూర్తైన వెంటనే ఉద్యోగం పొందలేకపోతున్నారని వెల్లడి
- "గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో యువ జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది.

మిగతా2లో



## జగన్‌కు ధైర్యం ఉంటే సీఈసీపై పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి



- విజయనగరం జిల్లా జామిలో పర్యటించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- అభిశంసనకు మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సంతకాలు పెట్టాలని డిమాండ్
- రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ బీద ఏడుపులు ఏడ్చారు

పెన్ పవర్ డెస్క్:జగన్‌కు ధైర్యం ఉంటే కేంద్ర ఎన్నికల ప్రధాన అధికా రిపై పార్లమెంటులో పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలానే మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సం తకాలు పెట్టాలని అన్నారు. విజయనగరం జిల్లా పర్య టించిన షర్మిల జామి గ్రామంలో నిర్వహించిన రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని దొంగ ఏడుపులు, నా అక్కచెల్లెమ్మల ఓట్లు ఎక్కడ పోయాయో అని బీద ఏడుపులు ఏడ్చారు కదా అని అన్నారు. అవసరమైనచోట దొంగ ఓట్లు, అవసరం లేనిచోట ఓట్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. - మిగతా2లో



## ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

- పశ్చిమాసియా సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్యమే మార్గం: భారత్
- ఈయూ మంత్రుల సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని చెప్పిన అధికార ప్రతినిధి
- దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి
- ఎక్కడా కొరత లేదని కేంద్ర స్పష్టం

మిగతా2లో


# ఏసీబీ ట్రాప్‌లో సర్వేయర్

## తాడేపల్లిగూడెంలో అవినీతి బహిర్గతం

- రూ.50 వేల లంచం డిమాండ్ చేసిన సర్వేయర్
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రామకృష్ణ
- ఇంటి, కార్యాలయాల్లో విస్తృత సోదాలు
- సర్వే సిబ్బంది, కుటుంబ సభ్యుల విచారణ
- ఇంచార్జి డివిజనల్ సర్వేయర్‌గా అదనపు బాధ్యతలు
- గతం నుంచే అవినీతి ఆరోపణల మబ్బులు
- ఏసీబీ దాడులతో మున్సిపల్ కార్యాలయంలో కలకలం
- అధికారుల సమక్షంలో ఆపరేషన్ విజయవంతం
- "నోటు కొట్టు - పత్రం పట్టు" వ్యవస్థపై విమర్శలు






పెన్ పవర్, తాడేపల్లిగూడెం, మార్చి 17:తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో అవినీతి మరోసారి బట్టబయలైంది. సర్వే రిపోర్ట్ కోసం రూ.50 వేల లంచం డిమాండ్ చేసిన సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం స్థానికంగా సంచలనం సృష్టించింది.

మిగతా2లో

## రైల్వే శాఖపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్

- పరీక్షను కన్నడలో నిర్వహించాలని వేలాది మంది ఉద్యోగులు, పలు సంస్థలు శాంతియుతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదు
- ఈ ఆకస్మిక నిర్ణయంతో కన్నడ ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి గురయ్యారు



మిగతా2లో



## పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి

- కాబుల్ దాడిని ఖండించిన భారత్
- మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శ
- పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని డిమాండ్

మిగతా2లో

# 'ఆ నిబంధన సరికాదు'

- ప్రసూతి సెలవులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే ఎక్కువగా ఉంటే ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని సుప్రీం వ్యాఖ్య
- పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

2



## వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్



- జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడనే చర్చ జరుగుతోంది: జగన్
- విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులు
- అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది
- రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదు

పెన్ పవర్ డెస్క్:తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు ఒంగోలు నియోజకవర్గ కేడర్‌తో భేటీ అయిన వైసీపీ అధినేత జగన్... కూటమి ప్రభుత్వంపై తన విమర్శనాస్త్రాలకు మరింత పదును పెట్టారు. వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్ అని... విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులని ఆయన అన్నారు. తమ ఐదేళ్ల పాలనకు, ప్రస్తుత చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారని జగన్ పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కోవిడ్ వంటి కష్టాలు ఎదురైనా, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య కూడా ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేశామని గుర్తు చేశారు. సుమారు రూ. 2.7 లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి -

మిగతా2లో




## 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా

- భవానీపూర్ బరిలో మమత-సువేందుతో మళ్లీ ఢీ
- ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దు
- జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోంది
- అభ్యర్థుల జాబితా విడుదల వేళ సీఎం మమత వ్యాఖ్యలు

మిగతా2లో

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండా

- పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి
- మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ భవనంలో ఏపీఈడీబీ నూతన కార్యాలయం ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయలు ఏపీకి వచ్చాయని వెల్లడి
- గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది
- దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి




పెన్ పవర్ డెస్క్:దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయలు ఏపీకే వచ్చాయని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఒప్పందాలతో పాటు పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలని సూచిం చారు. ఈ నెల 23వ తేదీన రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నా మని తెలిపారు. ఇంతటితో తృప్తి పడకుండా ఎందుకు 5 స్టీల్ సిటీలు నిర్మించకూడదనే లక్ష్యంతో పని చేయాలని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండాగా

- మిగతా2లో

# ఎడిటర్ వ్యూ

## పనిచేసే సామర్థ్యం ఉన్నా దేశంలో 40% పట్టభద్రులకు ఉద్యోగాలు లేవు

దేశంలో నిరుద్యోగంపై కీలక నివేదిక వెలువడింది. భారత్‌లో 20-29 ఏళ్ల మధ్య వయసున్న 63 మిలియన్ల మంది పట్టభద్రుల్లో 11 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నట్లు తేలింది. ఈ పట్టభద్రుల్లో ఏడు శాతం మందే గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాదిలోపు స్థిరమైన జీతంతో కూడిన ఉద్యోగాలు పొందుతున్నట్లు వెల్లడైంది. ఈ మేరకు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' పేరిట తాజాగా నివేదిక విడుదల చేసింది.

**'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' నివేదిక ప్రకారం**

పట్టభద్రుల్లో నిరుద్యోగం అధికంగానే ఉంది. 15-25 ఏళ్ల మధ్య వయసు వారిలో దాదాపు 40 శాతం, 25- 29 ఏళ్ల మధ్య వయసు వారిలో 20 శాతంగా నిరుద్యోగం ఉంది. తమ గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాదిలోపు అతి కొద్ది మంది మాత్రమే స్థిరమైన జీతంతో కూడిన ఉద్యోగాలు పొందుతున్నారు. ఇటీవలి సంవత్సరాలలో పట్టభద్రుల జనాభా పెరగడం వల్ల నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమైంది.

**'పట్టభద్రుల సంఖ్య పెరిగింది'**

"గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో యువ జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాగే ఉన్నత విద్యనభ్యసించేవారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో యువ పట్టభద్రుల సంఖ్యలో కూడా పెరుగుదల కనిపించింది. 2023 నాటికి 20- 29 ఏళ్ల మధ్య వయసు ఉన్న 63 మిలియన్ల పట్టభద్రుల్లో 11 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్యా అంతరాలను పూడ్చడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. ఉన్నత విద్యలో మొత్తం నమోదు నిష్పత్తులు దేశ అభివృద్ధి స్థాయికి అనుగుణంగా ఉన్నాయి. లింగ, కుల ప్రాతిపదికన విద్యను పొందడంలో ఉన్న సామాజిక, ఆర్థిక అడ్డంకులు తగ్గాయి. దాని ఫలితంగా భారత్‌లో కార్మిక మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్న శ్రామిక శక్తి మరింత సమర్థవంతంగా ఉంది" అని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా నివేదికలో పేర్కొంది.

## పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి

అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. సైనిక స్థావరంగా ఏమాత్రం సమర్థించుకోలేని ఆస్పత్రిపై దాడి చేసి, పెద్ద సంఖ్యలో పౌరుల ప్రాణాలను బలిగొనడం అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య అని మండిపడింది. ఈ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శించింది. ఈ హేయమైన చర్య ప్రాంతీయ శాంతిభద్రతలకు ప్రత్యక్ష ముప్పుని పేర్కొంది.

అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సరిహద్దు వెలుపల హింసకు పాల్పడటం పాక్ బరితెగింపు ధోరణికి అద్దంపట్టిందని ధ్వజమెత్తింది. ఆస్పత్రిని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతం, ఏ చట్టం, ఏ నైతికత సమర్థించలేదని స్పష్టం చేసింది. పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని, అఫ్గాన్ పౌరులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఈ విషాద సమయంలో అఫ్గాన్లకు అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు శాంతి, ఆత్మపరిశీలన, కరుణతో గడిపే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడి జరగడం దారుణం. ఒక ఆసుపత్రిని అందులోని రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతమూ, ఏ చట్టమూ, ఏ నైతికతా సమర్థించలేవు. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయాలి. ఆఫ్గానిస్థాన్‌లో పౌరులపై పాకిస్థాన్ చేస్తున్న విచక్షణారహిత దాడులను వెంటనే ఆపేలా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. మృతుల కుటుంబాలకు భారత్? తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఈ విషాద సమయంలో అఫ్గానిస్థాన్ ప్రజలకు భారత్? సంఘీభావంగా నిలుస్తుంది. అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు మా పూర్తి మద్దతును ఇస్తున్నాం."

**ఐక్యరాజ్య సమితి వేదికపై పాక్‌కు భారత్ కౌంటర్?**

పవిత్ర రంజాన్ మాసంలో అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను ఐక్యరాజ్య సమితి వేదికపై భారత్? తీవ్రంగా ఖండించింది. అలాగే అఫ్గాన్ జాతీయులను తరలించడంపైనా భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని పాక్ తీరును ఎండగట్టారు. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ఇస్లామోఫోబియాను ఎదుర్కొనే అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యలు చేశారు.

## 'ఆ నిబంధన సరికాదు'

చిన్నారులను దత్తత తీసుకునే మహిళలకు సంబంధించి ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువ ఉంటేనే ప్రసూతి సెలవులకు అర్హత అనే నిబంధన సరికాదని, దీనికి అనుమతించే సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020లోని సెక్షన్ 60(4) రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. చిన్నారి వయసుతో సంబంధం లేకుండా దత్తత తీసుకున్న సమయం నుంచి 12 వారాల పాటు ప్రసూతి సెలవులు తీసుకునేందుకు అర్హత ఉంటుందని తెలిపింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్న బిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదని, ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. నండూరి హంసనందిని అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్?పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును ఇచ్చింది. ఈ క్రమంలోనే సామాజిక భద్రత చర్యగా పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు సూచించింది.

అయితే, 1961 నాటి మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు (మూడు నెలలు) వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఇంకా ఈ చట్టం ప్రకారం అర్హులైన మహిళలకు 26 వారాలు వేతనంతో కూడిన సెలవుకు హక్కు కల్పిస్తుంది. ఇది ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగంలోని అన్ని కార్యాలయాలకు వర్తిస్తుంది. పితృత్వ సెలవుపై ప్రైవేట్ రంగానికి సంబంధించి ఎలాంటి చట్టం లేకపోయినా, ప్రభుత్వ ఉద్యోగులకు 15 రోజుల వేతనంతో కూడిన పితృత్వ సెలవుకు అర్హత ఉంది. ఒకవేళ ప్రైవేట్ రంగ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని పొందడానికి సరైన నిబంధనలు లేవు.

## రైల్వే శాఖపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్

రైల్వే ఉద్యోగుల ప్రమోషన్ పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేయడంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రైల్వే శాఖపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పరీక్షలను కన్నడ భాషలో రాసేందుకు అవకాశం కల్పించకపోవడంతో కన్నడ సంఘాలు నిరసన చేపట్టాయి. దీంతో రైల్వే శాఖ హఠాత్తుగా పరీక్షలను రద్దు చేసింది. ఈ చర్యను సిద్ధరామయ్య తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో, నైరుతి రైల్వే పరిధిలో 194 గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు, హుబ్బళ్లి డివిజన్‌లో 101 ఎల్‌డీసీఈ పోస్టుల ప్రమోషన్ల కోసం జరగాల్సిన పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేశారని తెలిపారు. ఈ ఆకస్మిక నిర్ణయంతో కన్నడ ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షను కన్నడలో నిర్వహించాలని వేలాది మంది ఉద్యోగులు, పలు సంస్థలు శాంతియుతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదని సిద్ధరామయ్య ఆరోపించారు. నిరసనలు ఉధృతమయ్యాక హడావుడిగా పరీక్షను రద్దు చేయడం ఖండనీయమని పేర్కొన్నారు. "మొదట్లోనే ఈ సమస్యను గుర్తించి, కన్నడలో పరీక్షకు అనుమతి ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. రైల్వే శాఖ కన్నడ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోంది," అని ఆయన విమర్శించారు. కర్ణాటకకు చెందిన వి. సోమన్న రైల్వే శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పటికీ ఇలాంటి పరిస్థితి రావడం అత్యంత దురదృష్టకరమని సిద్ధరామయ్య అన్నారు.

# ఏసీబీ ట్రాప్‌లో సర్వేయర్










- మొదటి పేజి తరువాయి

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో అవినీతి వ్యవహారం వెలుగులోకి రావడంతో స్థానికంగా కలకలం రేగింది. మున్సిపల్ సర్వేయర్‌గా పనిచేస్తున్న రౌతు రామకృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కడం ఈ వ్యవహారానికి కేంద్రబిందువైంది.

ఒక స్థలానికి సంబంధించిన సర్వే రిపోర్ట్ ఇవ్వడానికి ఆ స్థల యజమాని వద్ద రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కడకట్లకు చెందిన సిరంగి ఎడ్వర్డ్ కెనడీ ఈ విషయంపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ప్రణాళికాబద్ధంగా ట్రాప్ నిర్వహించారు. ఫిర్యాదుదారుడు నగదు అందజేస్తుండగా రామకృష్ణను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో అవినీతి వ్యవహారం బహిర్గతమైంది.

ఈ ఘటన అనంతరం ఏసీబీ అధికారులు సర్వేయర్ రామకృష్ణ నివాసంతో పాటు మున్సిపల్ కార్యాలయంలో విస్తృతంగా సోదాలు చేపట్టారు. అతని ఛాంబర్‌లో ఉన్న ఫైళ్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బంది, కార్యాలయానికి సంబంధించిన ఇతర సిబ్బంది, కుటుంబ సభ్యులను కూడా అధికారులు విచారిస్తున్నారు. రామకృష్ణ మున్సిపల్ సర్వేయర్‌గా పనిచేయడంతో పాటు ఇంచార్జి డివిజనల్ సర్వేయర్ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది. స్థానికంగా రామకృష్ణపై గతం నుంచే అవినీతి ఆరోపణలు ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. ఈ ట్రాప్‌తో అవి మరింత స్పష్టమయ్యాయని భావిస్తున్నారు. ఏసీబీ దాడులతో తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ఒక్కసారిగా ఉలిక్కిపాటు నెలకొంది.

ఈ దాడులను ఏసీబీ డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్లు ఎం. బాలకృష్ణ, కే. శ్రీనివాస్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో పై అధికారుల నుంచి కింది సిబ్బంది వరకు లంచాల వ్యవహారం కొనసాగుతోందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ఈ ఘటన నేపథ్యంలో "నోటు కొట్టు -- పత్రం పట్టు" అన్న వ్యవస్థ మున్సిపల్ కార్యాలయాల్లో స్థిరపడిపోయిందనే విమర్శలు మరింత బలపడుతున్నాయి. ప్రజలకు సేవలు అందించాల్సిన కార్యాలయాల్లో అవినీతి వేళ్లూనుకుపోయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తరణే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

తాజాగా విశాఖలో అదనపు స్టాక్ చేరడంతో సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని సీఎం భరోసా ఇచ్చారు. ఈకేవైసీ, ఓటీపీల సాయంతో గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయాన్ని ప్రస్తుతం ఉన్న దానికంటే తగ్గించి, కేవలం 1.5 రోజుల్లో వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు గ్యాస్ కొరత రాకుండా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఇండక్షన్ స్టవ్‌ల లభ్యతను కూడా పరిశీలించాలని సూచించారు.

**పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తరణే లక్ష్యం**

ఎల్పీజీ సరఫరాను పర్యవేక్షిస్తూనే, దీనికి శాశ్వత ప్రత్యామ్నాయంపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్వర్క్‌ను మరింతగా విస్తరించడం ద్వారా ప్రజలపై భారం తగ్గించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజల ఇళ్లకు చేర్చడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్ జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్ జీ) వినియోగాన్ని గరిష్ఠంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. గతంలో ఎల్ఎన్జీని ఏపీకి కేటాయించుకుని, రెండు సీజన్లలో పైప్ లైన్ ద్వారా కొండపల్లి వరకు తీసుకురాగలిగామని సీఎం గుర్తు చేశారు. తక్కువ వ్యయంతో కూడిన ఇంధనాన్ని వినియోగదారులకు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏజీ అండ్ పీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, జీజీపీఎల్, ఐఓసీఎల్, మేఘా గ్యాస్ వంటి సంస్థలు 198 సీఎన్జీ స్టేషన్ల ద్వారా గ్యాస్ సరఫరా చేస్తున్నాయని, 1.68 లక్షల గృహాలకు కనెక్షన్లు ఇచ్చే మౌలిక సదుపాయాలు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, అమరావతితో పాటు ఇతర పట్టణ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ నెట్వర్క్‌ను భారీగా విస్తరించేందుకు వెంటనే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించేలా పెట్రోలియం కంపెనీలతో మాట్లాడి, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు.

**'ఏపీ వన్' యాప్‌తో సత్వర సేవలు**

ఈ సమీక్షలో కేవలం ఇంధన అంశాలకే పరిమితం కాకుండా, పలు పాలనాపరమైన అంశాలపైనా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని, వారికి సంక్షిప్త సందేశాలు పంపాలని సూచించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం రూపొందిస్తున్న 'ఏపీ వన్ యాప్'ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. ప్రభుత్వ శాఖలు 'డేటా లేక్', 'అవేర్' వేదికలను ఏ మేరకు వినియోగించుకుంటున్నాయో గుర్తించి, వేసవిలో తాగునీరు, వడగాల్పులు, పశుగ్రాసం వంటి అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని, స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఇతర ఉన్నతాధికారులు, గెయిల్, ఓఎన్జీసీ, వివిధ పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం 291 మంది అభ్యర్థుల పేర్లతో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసీ) పార్టీ జాబితాను విడుదల చేసింది. మంగళవారం మీడియా సమావేశం వేదికగా ఈ జాబితాను టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. మిగతా మూడు సీట్లను తమ మిత్రపక్షం భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బీజీపీఎం)కు ఇచ్చామని ఆమె తెలిపారు. డార్జిలింగ్, కుర్సేఓంగ్, కాలిమ్ పోంగ్ స్థానాల్లో బీజీపీఎం పోటీ చేస్తుందని వెల్లడించారు. టీఎంసీ జాబితా ప్రకారం, భవానీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా, రాష్ట్ర విపక్ష నేత సువేందు అధికారి బరిలోకి దిగారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ స్థానంలో దీదీని సువేందు ఓడించారు. దీంతో ఈసారి నందిగ్రామ్‌తో పాటు భవానీపుర్ సీటును ఆయనకే బీజేపీ పెద్దలు కేటాయించారు.

**"ఈసీ పావులు కదిపినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయింది"**

బీజేపీ పాలనా వైఫల్యం వల్లే భారతదేశంలో ఎల్పీజీ వంటగ్యాస్ సంక్షోభం ఏర్పడిందని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దని బీజేపీకి ఆమె సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బంగాల్‌లో చాలా తెలివిగా పావులు కదిపిందని, అయినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయిందని మమత ఎద్దేవా చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ అసెంబ్లీ సీట్లు తగ్గిపోతాయన్నారు. ఇది బంగాల్ అస్తిత్వానికి సంబంధించిన ఎన్నిక అని, ఇందులో దిల్లీ లడ్డూ గెలవదని, బంగాలే గెలుస్తుందని దీదీ విశ్వాసం వెలిబుచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనకు ఉండే అధికారాలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని ఆమె తెలిపారు.

**"ఏదైనా జరిగితే, నిందలు నాపై మోపొద్దు"**

"నా సర్వ అధికారాలను కేంద్ర ప్రభుత్వం లాక్కుంది. ఒకవేళ రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు వస్తే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? ఒకవేళ శాంతిభద్రతల సమస్య తలెత్తితే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? నా ప్రభుత్వంలోని అధికారులంతా బంగాలీలే, చివరకు వాళ్లను కూడా తొలగించారు. ఇక వినీత్ కుమార్, మురళీధర్ లాంటి బంగాలీయేతర అధికారులను సైతం లాక్కున్నారు. కేంద్ర భద్రతా బలగాలను రాష్ట్రంలో మోహరించారు. వాళ్ల బాధ్యతను ఎవరు తీసుకుంటారు? బయటి వాళ్లు బంగాల్‌లో ఉన్నారు. వాళ్ల దగ్గర డబ్బులున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకవేళ ఏదైన జరిగితే, నిందలు నాపై మోపొద్దు" అని సీఎం మమత వ్యాఖ్యానించారు.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండా

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ఏకైక లక్ష్యం కావాలని అన్నారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ భవనంలో ఏర్పాటు చేసిన ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు నూతన కార్యాలయాన్ని మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయన్న మంత్రి ఇప్పుడు మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించామని వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్?పై దృషి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది. దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి. ఒప్పందాలతో పాటు పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి. ఇప్పుడు మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయి. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించాము. వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌పై దృషి సారించాలి. ఈ నెల 23న రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తాము.- నారా లోకేశ్, మంత్రి

## 'ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు'

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్య మార్గాల అవశ్యకతను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ చెప్పారు. యూరోపియన్ యూనియన్? నేతల ఆహ్వానం మేరకు బ్రస్సెల్‌లో పర్యటించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. "మా విదేశాంగ మంత్రి జై శంకర్ బ్రస్సెల్స్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఈయూ విదేశాంగ వ్యవహారాల కౌన్సిల్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ఈయూ ఉన్నత ప్రతినిధి, ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్ ఆయనను ఆహ్వానించారు. ఈ సమావేశంలో భారత్-ఈయూ సంబంధాలపై చర్చించడంతో పాటు ప్రపంచ సవాళ్లపై ముఖ్యంగా పశ్చిమాసియాలోని పరిస్థితిపై, ఇంధన భద్రతపై దాని ప్రభావాలతో సహా చర్చించారు. ఇందులో జైశంకర్?తో పాటు యూరోపియన్ యూనియన్‌లోని ఇతర మంత్రులు, ఈయూలోని వివిధ దేశాల విదేశాంగ మంత్రులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే సంక్షోభాన్ని త్వరగా ముగింపు పలకడానికి చర్చలు, దౌత్య మార్గాలను అనుసరించాల్సిన అవసరాన్ని మంత్రులు చర్చించారు." అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. అటు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రస్సెల్స్‌లో పర్యటించారు. బ్రస్సెల్స్‌లో పర్యటనను విజయవంతంగా ముగించానంటూ ఎక్స్? వేదికగా పోస్ట్ చేశారు. "యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల మండలి సమావేశం, ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఈయూ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌లతో భేటీ, ఈయూ ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్‌తో చర్చలు జరిగాయి. ఈయూ ప్రతినిధులను కూడా కలుసుకుని పలువురితో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరిపాము." అని పోస్ట్ చేశారు.

## వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్

-మొదటిపేజీ తరువాయి

చేరవేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే అప్పులు రూ. 3.30 లక్షల కోట్లు దాటాయని విమర్శించారు. జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడు? అనే చర్చ ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ జరుగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానం సాగుతోందని, అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అవినీతి కోసమే వారు అధికారంలో ఉన్నారని, ఎన్నికల హామీలను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఈ భేటీలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## జగన్‌కు ధైర్యం ఉంటే సీఈసీపై పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పనిచేస్తోందని షర్మిల అన్నారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానికి మద్దతు ప్రకటించాలని షర్మిల అన్నారు. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలని ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ తన చేతుల్లో పెట్టుకున్నారని ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోందని షర్మిల ఆరోపించారు. రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ బీద ఏడుపులు ఏడ్చారు. జగన్ కు ధైర్యం ఉంటే కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారిపై పార్లమెంటులో పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి. అలానే మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సంతకాలు పెట్టాలి. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానికి మద్దతు ప్రకటించాలి. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలి. ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ తన చేతుల్లో పెట్టుకున్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోంది.- వైఎస్ షర్మిల, ఏపీసీసీ అధ్యక్షురాలు శ్రీకాకుళం జిల్లాలో షర్మిల పర్యటన: అదే విధంగా నిన్న శ్రీకాకుళం జిల్లాలో షర్మిల పర్యటించారు. ఆముదాలవలస నియోజకవర్గంలోని కొర్లకోట గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి జగన్ బానిసగా మారారని అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసే నివాళులు అర్పించారు. అనంతరం ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి జెడీ శీలం, కిల్లి కృపారాణి, శ్రీకాకుళం జిల్లా సీపీసీ అధ్యక్షులు సనపల అన్నాజీరావుతోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జోరుగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం



మండల అధ్యక్షుడు ఆర్ శ్రావణ్ కుమార్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 17.** మండలంలో గల మాకవరం పంచాయతీ కుంబిరిపడ గ్రామంలో జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం పంచాయతీ అధ్యక్షులు ఎస్. ఉమాశంకర్, పార్టీ నాయకుడు బి. సీతారాం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు జనసేన మండల అధ్యక్షుడు ఆర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో జోరుగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు ప్రజల్లో తీసుకు వెళ్ళే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నామని, ఉద్యమి చెప్పడం శుభపరిణామంగా భావిస్తున్నామన్నారు. సుమారుగా గ్రామంలో 20 సభ్యత్వాలు తీసుకోవడం జనసేన పార్టీ బలోపేతానికి నాంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల మండల ప్రధాన కార్యదర్శి జి సతీష్ కుమార్, జన సైనికులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# ప్రతి రైతుకూ అండగా ప్రభుత్వం

- గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యం
- పశుసంపద వృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపు
- రైతన్నా మీకోసంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 17 :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి రైతుకూ అండగా నిలుస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులకు సాగునీరు, విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు గిరిజన ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, పశుసంపద వృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపొందుతుందని తెలిపారు.

పాచిపెంట మండలం కర్రివలస పంచాయతీ పరిధిలోని అమ్మవలస గ్రామంలో రైతన్నా మీకోసం – మెగా పాడి పశువుల పంపిణీ కార్యక్రమం ఐటీడీఏ, వ్యవసాయ – పశు సంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డితో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. నియోజకవర్గానికి 650 నాటుకోళ్ల పెంపకం యూనిట్లు మంజూరు అయ్యాయని, ఒక్కో మండలానికి (పాచిపెంట, సాలూరు, మెంటాడ) దాదాపు 200 యూనిట్ల వరకు వచ్చాయని తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా ఎదగడానికి, పిల్లలను బాగా చదివించుకోవడానికి ఈ పథకాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గిరిజన పిల్లలు హాస్టళ్లలో ఉండి చదువు కోవడానికి పునాది వేసింది నందమూరి తారక రామారావు అని కొనియాడారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులే టీచర్లుగా ఉండాలని నిర్ణయం తీసుకోవడం వల్ల నేడు అనేక మంది స్థానికులు ఉద్యోగాల్లో ఉన్నారని గుర్తు చేశారు. మహిళల కోసం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ (ఏడాదికి మూడు) గురించి ప్రస్తావించారు. 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు 20,000 రూపాయల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ఇంటింటికీ పింఛన్ల పంపిణీ సాఫీగా జరుగుతోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా 4000 నుండి 15,000 రూపాయల వరకు వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయని వివరించారు. మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం అమలులో ఉందని, ఇది వారి ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని చెప్పారు. రేపటి నుండి దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని ప్రకటించారు. దివ్యాంగులు తమ సర్టిఫికెట్ లేదా కార్డు చూపిస్తే ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. మొత్తంగా, ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం, మహిళల భద్రత మరియు రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

ఐటీడీఏ – ట్రైకార్ ద్వారా గిరిజనులకు పాడి పశువులను నేడు పంపిణీ చేసుకుంటున్నామన్నారు. సుమారు 5.86 కోట్ల వ్యయంతో మొత్తం 451 యూనిట్లు గల 902 పశువులను పంపిణీ చేసుకున్నట్లు చెప్పారు. ఒక్కో యూనిట్ ధర 65,000 రూపాయలు కాగా, అందులో 75% సబ్సిడీని ప్రభుత్వమే అందజేస్తుందని, మిగిలిన 25% మాత్రమే లబ్ధిదారుడి వాటా అని గుర్తుచేసారు. పశువుల కొనుగోలు ధర 5860 వేల మధ్య ఉండగా, ప్రతి పశువుకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఇందులో అత్యధికంగా మక్కువ 127, పాచిపెంట 109, సాలూరు 68 యూనిట్లు ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో పశువు రోజుకు 812 లీటర్ల పాల దిగుబడి రాగా, దీంతో అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు.



గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పశు సంపదపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 202 దూడలను ప్రదర్శించడం జరిగిందని అన్నారు. 50% సబ్సిడీతో పశువులకు ఆహారం పంపిణీ చేయగా, దీంతో 11,931 మంది పాడి రైతులు లబ్ధిపొందినట్లు చెప్పారు. ఇప్పటివరకు మొత్తం 596.55 మెట్రిక్ టన్నుల పశు ఆహారం పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు. జిల్లాలో ఎఫ్.ఎమ్.డి టీకా కార్యక్రమం ప్రారంభం అయిందని, 2.38 లక్షల డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. మొబైల్ వెటర్నరీ క్లినిక్ ద్వారా గ్రామాల వద్దే వైద్య సేవలు అందిస్తారని, పాడి రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వేసవిలో పశుసంరక్షణపై సూచనలు చేస్తూ నీరు, నీడ, పోషకాహారం కీలకమన్నారు. పశుసంపద అభివృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపు లక్ష్యం కావాలని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం గోకుల షెడ్, క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు, జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్లు, బ్యానర్లను మంత్రి కలెక్టర్ తో కలిసి ప్రారంభించారు. పాల క్యాన్లను, పీఎండిఎస్ నవధాన్యాల బస్తాలను, 451 పాడి పశువుల కొనుగోలు కొరకు 5,86,30,000 రూపాయల చెక్కును మంత్రి పంపిణీ చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం





**పాఠశాలలో అకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే గణబాబు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 15 :** విద్యార్థుల ఆరోగ్యం, అభివృద్ధి మరియు ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం" క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతుందో తెలుసుకునేందుకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ గణబాబు అకస్మికంగా పాఠశాలను సందర్శించారు. 89వ వార్డు కొత్తపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏపీయుఎఫ్ ఐడిసి డైరెక్టర్ అంగ ప్రశాంతితో కలిసి పరిశీలించిన ఆయన, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం, కూరలు, కోడిగుడ్లు, చిక్కీ వంటి పదార్థాలను పరిశీలించి, వాటి రుచి, పరిమాణం మరియు నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దార్శనికతకు అనుగుణంగా, పాఠశాలల్లో ఆహార నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో వంటగది పరిశుభ్రత, సరుకుల నిల్వ విధానం మరియు భోజనశాల పరిసరాలను సవివరంగా పరిశీలించారు. పరిశుభ్రత విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.

అదే విధంగా త్రాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, ఇంటర్నెట్ వంటి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న 'స్టూడెంట్ కిట్లు' అందాయా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలించారు. అలాగే 'తల్లికి వందనం' పథకం అమలు తీరును తెలుసుకున్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం, వారికి మెరుగైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. ఈ సందర్శనలో గమనించిన అంశాలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ అకస్మిక తనిఖీతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు మరింత మెరుగుపడే అవకాశముందని స్థానికులు భావిస్తున్నారు.

# సమయపాలన లేని ఆర్టీసీ బస్సులు.. గిరిజనులకు ఇబ్బందులు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలంలోని గిరిజన ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం డిపోకు చెందిన కొంతమంది బస్సు సిబ్బంది నిర్దేశిత సమయాలను పాటించకుండా స్వేచ్ఛగా బస్సులు నడుపుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.దారకొండ మాజీ సర్పంచ్ యేసువరరాజు మాట్లాడుతూ, నర్సీపట్నం నుంచి చింతపల్లి, జీకే వీధి మీదుగా దారకొండ, గుమ్మిరేవుల వరకు నడిచే బస్సులు నిర్ణీత సమయానికి రాకపోవడం లేదా ముందుగానే వెళ్లిపోవడం జరుగుతోందన్నారు. దీంతో ముఖ్యంగా మహిళలు, గిరిజన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు.ఇప్పటికే ఈ ప్రాంతంలో బస్సుల సంఖ్య తక్కువగా ఉండగా, సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో సమస్య మరింత తీవ్రమైందన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రయాణికులను ఎక్కించుకోకుండా బస్సులు వెళ్లిపోతున్నాయని ఆరోపించారు.ఈ పరిస్థితులపై సంబంధిత అధికారులు స్పందించి, నర్సీపట్నం డిపో సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, బస్సులు కచ్చితంగా సమయపాలన పాటించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



# చిక్కుముడి విప్పిన కేంద్ర మంత్రి..


- మూలపేట పోర్ట్ కు లైన్ క్లియర్..
- 385.24 ఎకరాల భూమి బదలాయింపు ఉత్తర్వులు విడుదల.
- సమస్య ఒడ్డుకు చేరడంతో మరింత వేగంగా పోర్ట్ నిర్మాణం.
- ఇటు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖతో, అటు ఎపి మేరిటైం బోర్డు ను సమన్వయం చేసిన రామ్మోహన్ నాయుడు.
- ఉగాది ముందు శుభవార్త తెచ్చిన శ్రీకాకుళం ఎంపి.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 17 :** మూలపేట పోర్టు నిర్మాణ క్రమంలో కీలక సమస్యగా మారిన 385 ఎకరాల సాల్ట్ ల్యాండ్స్ సమస్య కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో పరిష్కారం అయింది. ఇందుకు సంబంధించి భారత ప్రభుత్వ వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమల ప్రోత్సాహం మరియు అంతర్గత వాణిజ్య విభాగం నుండి మంగళవారం నాడు అధికారిక ఉత్తర్వులు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి దిశను మార్చే కీలకమైన ప్రాజెక్ట్ మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణాన్ని కీలకంగా తీసుకున్న కూటమి సర్కారు.. తాము అధికారంలోకి వచ్చింది మొదలు పనుల్లో వేగాన్ని పెంచింది. సమస్యలను సరిచేస్తూ.. నిత్యం సమీక్షలు చేస్తూ.. నిర్మాణంలో తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం అనుసంధాన రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి.

అయితే ఇదే తరుణంలో పోర్ట్ నిర్మాణంలో వీరికి ప్రధాన సమస్యగా మారింది నౌపాడ పరిధిలోని ఉప్పు భూముల సమస్య.. మొత్తంగా 385.24 ఎకరాల సాల్ట్ భూములు కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖా పరిధిలోని అంతర్గత వాణిజ్య విభాగం, సాల్ట్ విభాగం పరిధిలో నౌపాడ సాల్ట్ ఫ్యాక్టరీ ఆధీనంలో ఉన్నాయి. వీటిని పోర్ట్ నిర్మాణం కోసం అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వానికి, ఎపి మేరిటైం బోర్డు కు మధ్య చర్చలు నడుస్తూనే ఉన్నాయి. మూలపేట పోర్ట్ నుండి టెక్కలిని, జాతీయ రహదారిని అనుసంధానించేందుకు ఈ 385.24 ఎకరాలు కీలకంగా మారాయి. వీటి మీదుగానే వంద ఎకరాల పరిధిలో 330 అడుగుల విశాల రహదారులు, భవిష్యత్ ఎగుమతి, దిగుమతులకు సరిపడ మౌలిక వసతులను నిర్మించాలి. వీటితో పాటు సుమారు 280 ఎకరాలు ప్రధాన పోర్ట్ విస్తరణ కోసం అవసరం కానుంది. అయితే ఈ భూముల అప్పగింతపై ఏకాభిప్రాయం రాకపోవడంతో పోర్ట్ నిర్మాణంకు ప్రధాన అడ్డంకిగా మారింది.

ఈ సమస్య పరిష్కారం పై దృష్టి సారించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. అవకాశం దొరికిన ప్రతీసారి కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖతో, డైరక్టర్ ఆఫ్ పోర్ట్స్, పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్ సి.ఈ.ఓ, మేరిటైం బోర్డ్, శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం ఇలా వరుసగా భేటిలు, సమీక్షలు నిర్వహించారు. ఈ నేపధ్యంలో మంగళవారం నాడు ఈ భూములను నౌపాడ సాల్ట్ ఫ్యాక్టరి నుండి ఎపి మేరిటైం బోర్డ్ కు 99 ఏళ్ల లీజు ప్రాతిపదికన అప్పజేప్పుతున్నట్టు అధికారిక ఉత్తర్వులు రావడంతో శుభవార్తను రామ్మోహన్ నాయుడు జిల్లా వాసులకు తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా, ఉత్తరాంధ్ర అభివృద్ధి దిశను



మార్చనున్న మూలపేట పోర్ట్ విషయంలో తాజా సమస్య పరిష్కారంతో కీలక అడ్డంకి తొలగిందని ఆనందం వ్యక్తం చేశారు.

అన్ని అడ్డంకులు తొలగుతూ ఉండటంతో మరికొద్ది నెలల్లోనే మూలపేట పోర్ట్ అందుబాటులోకి వస్తుంది అనే ధీమాను రామ్మోహన్ నాయుడు వ్యక్తం చేశారు. ఈ అధునాతన గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ లో మొత్తంగా మూడు కార్గో బెర్తులు, ఒక కోల్ బెర్త్, ఇతర అధునాతన సదుపాయాలు ఉండనున్నాయి. ఎగుమతి, దిగుమతుల విషయంలో ఆంధ్రప్రదేశ్ లోనే భవిష్యత్ లో కీలకంగా మారనుంది మూలపేట పోర్టు. కూటమి సర్కారు భాధ్యత తీసుకున్న తరువాత స్థానిక మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుల చొరవతో శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి అవుతుండటం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పార్టీ బలోపేతమే లక్ష్యం.. ప్రజల సేవలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



వైస్సార్సీపీ నాయకులు

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 17.**గ్రామ కమిటీల నియామకంతో క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ పటిష్టంగా ఉండాలి...

చీపురుపల్లి నియోజకవర్గ అభివృద్ధి సాక్షిగా గెలుపే ధ్యేయంగా కదలాలి..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా, ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రతి కార్యకర్త నిరంతరం అందుబాటులో ఉండాలని మండల వైస్సార్సిపి నాయకులు పిలుపునిచ్చారు. చీపురుపల్లి మండలం చిననడిపల్లి పంచాయతీ చిననడిపల్లి గ్రామం ల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గడి రామునాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "మన కార్యకర్త – మన కుటుంబం" కార్యక్రమంలో జిల్లా వైస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిననడిపల్లి గ్రామంల్లో గ్రామ కమిటీతో పాటు అనుబంధ విభాగాల కమిటీలను వైస్సార్సీపీ నాయకులు రూపకల్పన చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించిన వైస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ..

రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పోరాడాలని కోరారు.

చీపురుపల్లి నియోజకవర్గ అభివృద్ధి చిత్రపటాన్ని పరిశీలిస్తే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తాయని వారు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈదగా కోరు ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ప్రభుత్వం వచ్చి అందరూ నిత్సాహితులై ప్రజలు ఉన్నారని ఎవరికీ ఏ పని దొరక్క ప్రజలందరూ అల్లాడుతున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు రైతులకు సకాలంలో ఎరువుల దొరక్క రైతు అల్లాడుతున్నాడు, యువత ఉద్యోగులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు ఈ కూటమ ప్రభుత్వం వచ్చి ప్రజలకు మంచి జరగడం దేవుడు కెరుగు.... నాయకులకు మంచి జరుగుతుంది వాళ్ల తప్పు చేసిన అమ్మాయిలు పట్ల విచక్షణగా ప్రవర్తించిన అధినాయకుడు వెనకేసుకుని వస్తున్నారు . ఈ ప్రభుత్వాన్ని మీరే గమనించాలని కోరారు

ఈ ప్రభుత్వం వచ్చి కొత్తగా ఒక పెన్షన్ అయినా ఇచ్చారని సభ ముఖంగా అడిగారు

ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, పెదనడిపల్లి ఎంపీటీసీ రేగాన ఆదినారాయణ , ప్రభాత్ కుమార్, సీనియర్ నాయకులు, మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పతంజలి పురస్కారానికి కుప్పిలి పద్మ ఎంపిక



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 17 :** కె.ఎన్.వై పతంజలి సాహితీ పురస్కారానికి ఈ ఏడాదికి గాను ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి కుప్పిలి పద్మని ఎంపిక చేసినట్లు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ ప్రకటించారు. ఈ నెల 29వ తేదీన గురజాడ కేంద్ర గ్రంథాలయంలో జరిగే పతంజలి జయంతోత్సవాలలో ఈ పురస్కారాన్ని ఆమెకు ప్రధానం చేస్తామని మంగళవారం గురజాడ ఇంట్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. గడిచిన పదేళ్లుగా పతంజలి పేరిట రచయితలైన జర్నలిస్టులకు ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు బిశెట్టి తెలిపారు. ఇప్పటి వరకూ మోహన్, దేవీ ప్రియ, సతీష్ చందర్, జీ.ఆర్. మహర్షి, గంటేడ గౌరి నాయుడు, అట్టాడ అప్పలనాయుడు, చింతకింది శ్రీనివాసరావు, రౌతు బంగారు నాయుడు, అరుణ పప్పు, తాడి ప్రకాష్ కి ఇవ్వడం మా వేదికకు ఎంతో గర్వకారణమన్నారు. ఆ క్రమంలోనే ఈ ఏడాదికి గాను కుప్పిలి పద్మని తమ కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఆమె వార్తలో మైదానం శీర్షికన సమకాలీన అంశాలపై స్పందించిన తీరు తెలుగు విమర్శకుల ప్రశంసలు అందుకున్నారని అన్నారు. సుమారుగా 159 కథలు రాశారన్నారు. వాటిలో ఆరు నవలలు ఉన్నాయన్నారు. ప్రధానంగా కరోనా మహమ్మారి ముట్టడించి అతలాకుతలం చేస్తున్న దశలో 'మళ్లీ తేయాకు తోటలోకి' పేరిట కార్మికుల జీవితాల్లోని ఒడిదుడుకులను చాలా హృద్యంగా రచించారన్నారు. రచనా వ్యాసంగంలో ఆమె ప్రతిభాపాటవాలకి గుర్తుగా ఎన్నో అవార్డులు ఆమెను వరించాయని తెలిపారు. వాటిలో ప్రముఖంగా ఆంధ్రప్రదేశ్ ఉగాది పురస్కారం, సుశీలా నారాయణ రెడ్డి ఉత్తమ రచయిత్రి అవార్డు, అరుణ్ సాగర్ సాహితీ పురస్కారం, అమృతలత అపూర్వ అవార్డు, వాసిరెడ్డి సీతాదేవి అవార్డు, చాసో పురస్కారం, దాట్ల దేవదానందరాజు సాహితీ పురస్కారం... ఇలా ఎన్నో పురస్కారాలు ఆమె అందుకున్నారు. మన ఉత్తరాంధ్రకి చెందిన ప్రముఖ మహిళా రచయిత్రి కావడం మరింత గర్వకారణమని కొనియాడారు. ఈ నెల 29 ఆదివారం గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సాయంత్రం 5.30 గంటలకి జరిగే పతంజలి సాహితీ పురస్కార సభకి సాహితీ వేత్తలు, విద్యార్థులు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వేదిక కార్యదర్శి ఎన్.కె.బాబు, ప్రతినిధులు వి.ఎమ్.కె.లక్ష్మణరావు, బండ్ల మూడి నాగేంద్ర ప్రసాద్, పిడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్ర రాజు, తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు.



**చీపురుపల్లి నియోజకవర్గం పెన్ పవర్ మార్చి 17.**తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రివర్యులు మరియు చీపురుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ కిమిడి కళావెంకట రావు గరివిడి మండలం ఎం.దుగ్గివలస గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన పోషకాహారం అందుతుందా? భోజన సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయా? అని విద్యార్థులను మరియు పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:

విద్యావ్యవస్థలో సమూల మార్పుల కోసం నారా లోకేష్ గారు విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం గరివిడి మండల పార్టీ అధ్యక్షులు సారీ పాక సురేష్ బాబు, రైతు సంఘం అధ్యక్షులు పైల బలరాం , మండల విద్యాశాఖ అధికారి పి. రామారావు ,కూటమి నాయకులు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ను కలిసిన నూతన ఏఎస్పీ.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 17.పెన్ పవర్.** మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నాడు ప్రభుత్వ విప్ & కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ని పార్వతీపురం మన్యం జిల్లా నూతన అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఏ.ఎస్.పి వెంకటేశ్వర రావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ యం.వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే కు పూల కుండీ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం నియోజకవర్గంలోని శాంతి భద్రతల పరిస్థితులు,ప్రజల సమస్యలు మరియు పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిసింది.ఎమ్మెల్యే ఏఎస్పీకి అభినందనలు తెలియజేసి,ప్రజలకు మెరుగైన భద్రత కల్పిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఏఎస్పీ వెంట ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ హరి,సబ్ ఇన్ స్పెక్టర్ శివ ప్రసాద్ పాల్గొన్నారు.

# అమ్మ ఆశయం.. అక్షర విజయం!





- సివిల్స్ విజేత రాముకు కలెక్టర్ ఘన సత్కారం
- తల్లిని గౌరవించి, స్వయంగా సాగనంపిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 17:**ప్రభుత్వ బడిలో చదివి, పేదరికాన్ని జయించి సివిల్స్‌లో 463వ ర్యాంక్ సాధించి సత్తా చాటిన సారోతు రామును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో కలసి ఘనంగా సత్కరించారు. ఈ అపురూప ఘట్టానికి రాము తల్లి లక్ష్మి కూడా సాక్షిగా నిలిచారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది కలిసి రాముకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, విలువైన పుస్తకాలను బహుకరించి అభినందించారు.

రాము ప్రతి విద్యార్థికి ఒక గొప్ప ఆదర్శం. తల్లి కూలీ పనులు చేస్తూ కొడుకును తీర్చిదిద్దడం, తండ్రిని కోల్పోయినా కుంగిపోకుండా ఎన్ఐటీ వరంగల్‌లో చదివి, నేడు సివిల్స్‌లో ర్యాంకు సాధించడం సామాన్యమైన విషయం కాదని కలక్టర్ కొనియాడారు. రాము సాధించిన ర్యాంకుకు ఐపీఎస్ వస్తుందని భావిస్తున్నానని, ఐఏఎస్ కూడా వచ్చే అవకాశం ఉందని, ఏ విభాగంలో సేవలందించినా జిల్లాకు గర్వకారణమని ఆకాంక్షించారు.

కలెక్టర్ పెద్దమనసు..

సత్కార కార్యక్రమం ముగిసిన అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. రాము తల్లిని గౌరవిస్తూ, ఆ తల్లికొడుకులను స్వయంగా కలెక్టర్ కార్యాలయం కింద వరకు తోడ్కొని వెళ్లి, మర్యాదపూర్వకంగా సాగనంపారు. ఉన్నతాధికారి చూపిన ఈ ఆత్మీయతకి వారిరువురు కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన రామ్ మల్లిక్ నాయుడు.



**చీపురువల్లి నియోజకవర్గం పెన్ పవర్ మార్చి 17.**

ఆపదలో ఉండి వైద్యం కోసం ఆర్థిక సాయం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఒక వరం లాంటిదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, యువ నాయకులు శ్రీ కిమిడి రామ్ మాలిక్ నాయుడు గారు అన్నారు. ఈరోజు మేరకముడిదం మండలంలో పర్యటించిన ఆయన.. వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

మండలంలోని గరుగుబిల్లి, మేరకముడిదం, చినబంటుపల్లి, ఊటపల్లి, కొండలవేరు గ్రామాలకు చెందిన మొత్తం ఏడుగురు (7) బాధితులకు రూ. 2,79,000/- (రెండు లక్షల డెబ్బై తొమ్మిది వేల రూపాయలు) విలువ గల చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాడి ఆరోగ్యానికి, సంక్షేమానికి తెలుగుదేశం-కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వైద్య ఖర్చుల భారంతో ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకూడదన్నదే ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, బైరిపురం మాజీ సర్పంచ్ వి కెంగువ ధనుంజయ్ , చల్ల శ్రీరామ్ మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో ప్రభుత్వవ విప్.



రైతన్నలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కూటం ప్రభుత్వం ముందడుగు.

**గుమ్మలక్ష్మీపురం మార్చి 17 పెన్ పవర్.**రైతన్న సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కూటమి ప్రభుత్వం"రైతన్నా మీకోసం"వంటి కార్యక్రమాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు.మంగళవారం నాడు పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం పిట్టలమెట్ట గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ.రైతుల కు కూటమి ప్రభుత్వం అన్నదాతల కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో రైతులు నూతన సాగు విధానాలను అవలంబించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు.సాంప్రదాయ పంటలతో పాటు ఆధునిక సాగు పద్ధతులను అలవాటు చేసుకోవాలని,ఇందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు.ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.6 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలును కలిపి మొత్తం రూ.20 వేలును మూడు విడతలుగా రైతులకు అందించామని చెప్పారు.ప్రతి రైతును భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు,ముఖ్యంగా అన్నదాత సుఖీభవ మూడవ విడత ప్రయోజనాలు గురించి కార్యక్రమంలో వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

## మునగ ఉత్పత్తులతో మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం- నాబార్డ్ డీడీఎం రమేష్ కృష్ణ



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 17:** గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే నాబార్డ్ ప్రధాన లక్ష్యమని, మునగ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా మహిళలు నెలకు 10 వేల రూపాయల వరకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి రమేష్ కృష్ణ పేర్కొన్నారు.

మెలియాపుట్టి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నాబార్డ్ ఆధ్వర్యంలో, జిల్లా మహిళా సమాఖ్య అమలు చేసిన 15 రోజుల 'మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' మంగళవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మునగలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. ఈ శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించడంతో పాటు, నాబార్డ్ ప్రాయోజిత ప్రదర్శనలు, రూరల్ మార్ట్ ద్వారా మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని 30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు 15 రోజుల పాటు శిక్షణ పొందారు. మునగ పొడి, లడ్డూలు, ప్రోటీన్ మిక్స్, మునగ టీ, ఫేస్ ప్యాక్, మోరింగా మిల్లెట్ పకోడి వంటి వినూత్న ఉత్పత్తుల తయారీలో వీరికి ప్రాయోగిక పరిజ్ఞానం అందించారు. కార్యక్రమం అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రమేష్ కృష్ణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎంలు ఈశ్వరరావు, త్రినాథమ్మ, మండల మహిళా సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మన్నార్ రాజగోపాలస్వామి దేవాలయంలో ఉగాది వేడుకలు



- ఏర్పాట్ల పై సమీక్షించిన డి.ఆర్.ఓ సత్తిబాబు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 17**: ఈ నెల 19న స్థానిక శ్రీ మన్నార్ రాజగోపాలస్వామి దేవాలయంలో ఉగాది పండుగ సందర్భంగా వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈ వేడుకలు ఘనంగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని డి.ఆర్.ఓ సి. హెచ్. సత్తిబాబు తెలిపారు. మంగళవారం డి.ఆర్.ఓ ఆయన ఛాంబర్లో అధికారులతో ఉగాది ఏర్పాట్లపై సమీక్షించారు. నాదస్వరం, వేద పండితుల ఆశీర్వాదం, పంచాంగ శ్రవణం, పండిత సత్కారం, పులిహోర, ఉగాది పచ్చడి తదితర కార్యక్రమాలను దేవాదాయ శాఖ వారు చూడాలని తెలిపారు. అరటి, మామిడి తోరణాలు ఉద్యాన శాఖ వారు, సాంస్కృతిక కార్యక్రమాలను మహారాజా సంగీత కళాశాల వారు నిర్వహించాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. అధికారుల మధ్య సమన్వయం తో పండగ వేడుకలను ఘనంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

ఈ సమావేశం లో ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ, పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, డి.ఎం.హెచ్.ఓ డా.జీవన రాణి, ఉద్యాన, దేవాదాయ, సమాచార శాఖ, సంగీత కళాశాల, సెట్విజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నర్సీపట్నం అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దాం

- చివరి కౌన్సిల్ సమావేశంలో స్పీకర్ అయ్యన్న
- సరదాగా సాగిన చివరి కౌన్సిల్ సమావేశం



**నర్సీపట్నం, పెన్ పవర్ (మార్చి 17) :**నర్సీపట్నం అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కలిసి పని చేద్దామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. నర్సీపట్నం మున్సిపాలిటీ చివరి కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో చివరి కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశం ఆద్యంతం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. సభ్యులందరూ తమ ఐదేళ్ల కాలంలో అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నర్సీపట్నం అభివృద్ధికి అందరం, పార్టీలకు అతీతంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, మహానుభావులైన నందమూరి తారక రామారావు, ఇందిరాగాంధీ లాంటి వారినే ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. తాను రాజకీయాల నుంచి రిటైర్ అయ్యే లోపు నర్సీపట్నంకు సంబంధించి అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. స్పీకర్ హోదాలో తాను ఏ ఒక్క పార్టీకి పరిమితం కాదని, అభివృద్ధి విషయంలో అన్ని వార్డులను సమానంగా చూస్తానని అన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ నిధులు 21 కోట్లు నర్సీపట్నం మున్సిపాలిటీకి తీసుకువచ్చానని, మరో 10 కోట్లు వచ్చే నెలలో రానున్నాయని ప్రకటించారు. కౌన్సిలర్లు ఏ పార్టీ వారైనా తమ వార్డు ప్రజల కోసం తన వద్దకు వస్తే సహకరిస్తానని హామీ ఇచ్చారు. నర్సీపట్నంను పర్యాటక రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. పెద్ద చెరువులో 108 అడుగుల భారీ శివపార్వతుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనిని చూసేందుకు రానున్న రోజుల్లో వేలాదిమంది పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూకాలమ్మ పండుగ సందర్భంగా కౌన్సిలర్లు అందరూ జాతరలో పాల్గొనాలని ఆహ్వానించారు. చివరి కౌన్సిల్ సమావేశం సందర్భంగా హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడును, మున్సిపాలిటీ తరపున ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే మున్సిపాలిటీ తరపున కౌన్సిలర్లు అందరినీ ఘనంగా సత్కరించి, జ్ఞాపకాలు అందజేశారు. చివరిలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులతో కలిసి స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఫోటో దిగారు. అనంతరం జరిగిన ఆత్మీయ విందులో అందరూ ఆనందంగా పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పూర్ణపాడు-లాభేసు వంతెన సాధన యాత్ర.

- వర్షాకాలం రాకముందే వంతెన పూర్తి చేయాలి.
- గిరిజనుల ఓట్లతో పదవులు పొంది తర్వాత ముఖం చాటేస్తున్న పాలకులు
- ఎన్నికల హామీలకే వాడుకుంటున్న వైనం
- వర్షాకాలంలో బాదిత గ్రామాల బాధలు ప్రభుత్వం గుర్తించాలి.
- బుధవారం నుండి బాధిత గ్రామాల్లో పర్యటిస్తామన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**గుమ్మ లక్ష్మీపురం, కొమరాడ మార్చి 17 పెన్ పవర్.** కొమరాడ మండలంలోని పూర్ణపాడు లాభేసు గ్రామాల మధ్య నాగవల్లి ఉన్నది పై అసంపూర్తి నిర్మాణంగా ఉన్న పూర్ణపాడు లావైసు వంతెన సాధన కోసం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకటించారు.మంగళవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు,కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో దాలి నాయుడు మాట్లాడుతూ. గత 20 సంవత్సరాలుగా పూర్ణపాడు,లాభేసు వంతెన పూర్తి కాక నాగావళి నది ఆవతల ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.దీన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ బుధవారం నుండి బాధిత గ్రామాల్లో పూర్ణపాడు లాభేసు వంతెన సాధన యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.వర్షాకాలం రాకముందే ఈ వేసవిలోనే పనులు ప్రారంభించి వంతెన పూర్తిచేయాలన్నారు.వంతెన నిర్మాణం గత 20 సంవత్సరాలుగా పూర్తి కాలేదని ఆరోపించారు.గిరిజనుల ఓట్లతో పదవులు పొందుతున్న పాలకులు తర్వాత ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు.దీని ఫలితంగానే పూర్ణపాడు లాభేసు వంతెన అసంపూర్ణంగా ఉందన్నారు.తొమ్మిది పంచాయతీలు సుమారు 46 గ్రామాల ప్రజల ఇబ్బందులను పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.వర్షాకాలం వస్తే బాహ్య ప్రపంచంతో సత్సంబంధాలు ఆయా గ్రామాలు కోల్పోతున్నాయన్నారు.వర్షాకాలంలో ఇటు నాగావళి నది అటు గుమ్మిడిగెడ్డ ఉధృతంగా ప్రవహించే సమయంలో మండల,జిల్లా కేంద్రాలకు నాగావళి నది ఆవతల ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నారన్నారు.గతంలో నాటు పడవల ప్రమాదాలు,పలువురు మృత్యువాత చెందిన సంఘటనలు లేకపోలేదన్నారు.అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందక పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి అన్నారు.వర్షాలు విపరీతంగా పడే సమయంలో వర్షాకాలంలో నది దాటే సమయంలో పలువురు మృత్యువాత పడే సంఘటనలు లేకపోలేదు అన్నారు.అటువంటి ప్రమాదకర గిరిజనులకు అత్యవసరమైన పూర్ణపాడు లాభేసు వంతెన నిర్మాణానికి పాలకులు శ్రద్ధ చూపకపోవడం బాధాకరమన్నారు.తక్షణమే ఈ వేసవిలోనే పూర్ణపాడు లాభేసు వంతెన పూర్తి చేయాలని కోరుతూ పూర్ణపాడు లాభేసు వంతెన సాధన యాత్ర కార్యక్రమాన్ని ఆయా బాధితు గ్రామాల్లో చేపడతామని చేపడతామన్నారు.ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఆయన వెంట లీగల్ సెల్ ఇంచార్జి. కోలా కిరణ్ కుమార్,ఓబిసి చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్,యువజన నాయకులు గొర్లి ధనుంజయ్,ఉన్నారు.

## అధిక పెన్షన్ కొరకు విశ్రాంత కార్మికులు అరణ్యరోధన





**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,మార్చి 17 :** స్టీల్ ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగులకు అధిక పెన్షన్ కొరకు మరొక అవకాశం కల్పించాలని స్టీల్ ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగులు కోరారు. విశ్రాంతి స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ఈ అంశం పై స్థానిక ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కార్యాలయం వద్ద చేరుకుని కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు.
విశ్రాంతి ఉద్యోగులు కమిషనర్ ని ప్రధానంగా ఈ అంశాలపై చర్చలు జరిపారు. వివిధ కారణాల వలన తిరస్కరించబడిన వారి అందరికి మరలా డిమాండ్ నోటీసులు పంపాలని. అందరికీ సెప్టెంబర్ 2014 ముందు 2014 తరువాత అనే వివక్షత చూపకుండా అధిక పెన్షన్ కొరకు ఆప్షన్ అవకాశం కల్పించాలని కోరారు . చర్చల అనంతరం కమిషనర్-2 అవినాష్ కుమార్ పెన్షనర్స్ వద్దకు వచ్చేసి వివరణ ఇచ్చారు . కమిషనర్కి స్టీల్ పెన్షనర్స్ అందరూ తమ డిమాండ్లను వివరించారు .
ఏపీ ఆర్.పి.ఏ జిల్లా కార్యదర్శి హుస్సేన్ విచ్చేసి తమ పూర్తి మద్దతును తెలియజేశారు. స్టీల్ పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ లకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎన్ రామారావు, పూర్వ సిఐటియు అధ్యక్షుడు వైటి దాస్, ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, స్టీల్ ప్లాంట్ పెన్షనర్స్ ఎం కృష్ణారావు, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, బి గురప్ప, సిహెచ్ నారాయణరావు, అప్పలరాజు, సంపూర్ణం, సూరిబాబు, దత్తాత్రేయ రాజు, అధికారుల నుండి ఉమామహేశ్వరరావు, డి సుందర్ తదితరులు పాల్గొన్నారు .

## ఆరోగ్య సేవలపై శిక్షణ కార్యక్రమం





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 17:**అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జీకే వీధి పీహెచ్‌సీ పరిధిలోని రింతాడ 1, 2, దామనపల్లి సచివాలయాల్లో ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎయిమ్స్ న్యూ ఢిల్లీ ఎక్స్‌హెచ్‌డబ్ల్యూసీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆశలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు గ్రామ ఆరోగ్య, పారిశుధ్యం, పోషకాహారం అంశాలపై అవగాహన కల్పించారు.విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందిస్తున్న 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో టిబి వ్యాధి నివారణ, మందుల వినియోగం, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై అవగాహన పెంపు అవసరమని తెలిపారు. ప్రతి నెలలో రెండు సార్లు విఎచ్ఎన్‌డీ కార్యక్రమాలు నిర్వహించి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు టీకాలు, సేవలు అందించాలని సూచించారు. జేఎస్‌వై పథకం, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ సభ్యులు శ్రీనివాస్, రాజు, తేజ, హెచ్‌వీ ఎర్రయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు నిర్మల, మధులత, లింగేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏసీఏ ఆధ్వర్యంలో మార్చి 23 నుంచి 27 వరకు



దివ్యాంగుల ఆల్ ఇండియా జోనల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్

**బిమిలి, పెన్ పవర్, మార్చి 16 :**దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహిం చేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో "ఫిజికల్లీ డిసేబిలిటీ ఆల్ ఇండి యా జోనల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్2026"ను మార్చి 23 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీలు విశాఖపట్నంలోని విడిసిఏ బి గ్రౌండ్‌లో జరుగనున్నాయి.ఈ విషయాన్ని ఏసీఏ డిసేబిలిటీ క్రికెట్ కమిటీ చైర్మన్ రామన్ సుబ్బా రావు, సభ్యుడు మరియు డీసీసీఏపీ కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ సోమవారం నిర్వ హించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఐదు జోన్లకు చెందిన జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటాయని తెలిపారు. సెం ట్రల్, ఈస్ట్, నార్త్, సౌత్, వెస్ట్ జోన్ల జట్లు తమ ప్రతిభను ప్రదర్శించనున్నాయి. టోర్నమెంట్‌లో పాల్గొనే దివ్యాంగ క్రీడాకారులకు రాష్ట్రస్థాయి క్రీడాకారులతో సమానంగా వసతి, భోజనం, స్థానిక రవాణా, క్రీడా దుస్తులు, ట్రోఫీలు వంటి అన్ని సౌకర్యాలను ఏసీఏ సమకూరుస్తుందని వివరించారు.
ఈ కార్యక్రమానికి ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ చిన్ని, కార్యదర్శి సాన సతీష్ బాబు మరియు అపెక్స్ కౌన్సిల్ సభ్యులు సహకారం అందిస్తున్నారని తెలిపారు. దివ్యాంగ క్రీడాకారు లకు ఇంతటి సదుపాయాలు కల్పిస్తున్నందుకు డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ సమావేశంలో డీసీసీఏపీ ఎడ్వైజర్ రమణ, విశాఖ జిల్లా డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కమిటీ కార్యదర్శి వి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాసుపుస్తకాల పంపిణీ వేగంగా పూర్తికావాలి

- జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 17 :** జిల్లాలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, రీసర్వే, 22 ఏ భూములు తదితర రెవెన్యూ అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని పరిస్థితులను సిఎస్‌కు కలెక్టర్ వివరించారు.
ఈ విసి అనంతరం కలెక్టర్ రాంసుందర్ రెడ్డి జిల్లా అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. ప్రతీ నెలా 9వ తేదీలోగా నిర్ధేశించిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఒక్క తప్పుకూడా లేకుండా పాసుపుస్తకాలను రూపొందించాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మ్యుటేషన్లను వీలైనంత వేగంగా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, ఆర్‌డిఓలు వెంకటేశ్వర్రావు, సుధారాణి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## సంకాడ పంచాయతీలో రైతన్న మీకోసం"

టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షులు దేశగిరి గోవింద రావు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 17:**గూడెం కొత్తవీధి మండలం సంకాడ పంచాయతీ పరిధిలోని చిత్తమామిడి, డింగిరాయి, గ్రామాలలో "రైతన్న మీకోసం" కార్యక్రమంలో భాగంగా గ్రామ కమిటీ అధ్యక్షులు గోవిందరావు రైతులకు పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి అంశాలను వివరించారు. రైతు బాగుంటే దేశం బాగుంటుందని దేశం బాగుంటే రాష్ట్రం బాగుంటుందని తద్వారా మనందరం బాగుంటామని నమ్మిన ప్రభుత్వం ఎండిఏ ప్రభుత్వమని అన్నారు. రాష్ట్ర ఆర్థిక సౌధానికి మూల స్తంభం వ్యవసాయనేనని వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య రంగాలు వంటివి 35 శాతం వరకు వాటా అందిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ముందుకు నడిపిస్తుందని అటువంటి రైతుని కష్టాలు లేకుండా చూసుకొని సకాలంలో వారికి కావాల్సిన ఎరువులను, విత్తనాలను, వ్యవసాయ పరికరాలను అందించడమే ముఖ్య లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భూత్ ఇంచార్జ్ సద్ద బొజ్జిపాడల్, కోశాధికారి, దేశగిరి సంజీవరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ సాగిన కైలాసపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మొండిగుమ్మలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

- పిఎం జన్మన్ నిధులు సుమారు 80 లక్షలతో 600 మీటర్ల బిటి రోడ్డు నిర్మాణం.
- బాబుసాల పంచాయితీ సర్పంచ్ మఠం బంగారమ్మ, ఎంపిటిసి మినుముల పార్వతమ్మ.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 17.**పల్లెల్లో రహదారుల అభివృద్ధికి, రవాణ సౌకర్యాలను మెరుగు పరచడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నాయి. స్వాతంత్ర్య అనంతరం 79 ఏళ్ల కలలు సాకారమావుతూ రోడ్ల నిర్మాణాలతో సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

గిరిజన గ్రామాల్లో స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాల తరువాత రహదారులను అనుసంధానం చేస్తూ, నూతన రహదారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తుండడంతో గిరిజన పల్లెల్లో వెలుగులు నింపుతున్నాయి. అడవి తల్లి బాట, పిఎం జన్మన్ నిధులతో మారుమూల గిరిజన పల్లెల్లో రహదారులు నిర్మిస్తుండటంతో గిరి ప్రజల్లో ఆనందం వెల్లివేరుస్తుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలం, బాబుసాల పంచాయితీ, మొండిగుమ్మ గ్రామంలో సుమారు 80 లక్షల రూపాయలతో 600 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్ మఠం బంగారమ్మ, ఎంపిటిసి మినుముల పార్వతమ్మ, యువ నేత మఠం రాజేంద్రప్రసాద్ మంగళవారం కొబ్బరికాయలు కొట్టి బీటి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 79 ఏలు గడిచిన తమ పంచాయితీలో పలు గ్రామాల్లో రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారనీ, ప్రజలు అనారోగ్యం గురైనప్పుడు రహదారి సమస్యతో 108 వాహనము గ్రామంలో రాక, వైద్య సేవల కొరకు మండల కేంద్రానికి వెళ్లాలన్న తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనే వారన్నారు. తప్పని పరిస్థితుల్లో డోలి మోతలు, గుర్రాలు మాత్రమే ప్రజలకు దిక్కుగా ఉండేవన్నారు. తాము సర్పంచ్ ఎంపీటీసీలుగా గెలుపొందిన తరువాత మొండిగుమ్మతో పాటు పంచాయతీ పరిధిలో పలు గ్రామాలకు రహదారి కల్పనకు పలుదపాలుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నేడు మొండిగుమ్మతోపాటు, పంచాయతీలో పలు గ్రామాల్లో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. మొండి గుమ్మలో సుమారు 80 లక్షల రూపాయలతో 600 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నేపద్యంలోనే నేడు మొండిగుమ్మలో బీటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించమన్నారు. తమ హాయంలో పంచాయతీలో రహదారి నిర్మాణాలు జరుగుతుండడం పట్ల సర్పంచ్ ఎంపీటీసీలు ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీలో పలు గ్రామాల్లో కూడా త్వరలోనే రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయుటకు కృషి చేస్తామన్నారు. మొండిగుమ్మలో రహదారి నిర్మాణం చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ.. సర్పంచ్, ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత మినుముల అప్పారావు, గ్రామస్తులు నరేష్, చలపతి, నీలకంఠం, ధనుర్చాయ్ సత్య రావు, ముంగురాజు, సువర్ణ, సుజాత, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో మహిళల నిరసన

- టీడీపీ, పోలీసుల చర్యలపై వైఎస్ఆర్‌సీపీ ఆగ్రహం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 17 :** తిరుపతిలో మహిళలపై జరిగిన దాడులు, పో లీస్ చర్యలకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో విశాఖప ట్నంలో నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. నగరంలోని ఎల్ఐసీ జంక్షన్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ నిరసన చేపట్టా రు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ నాయ కులు మాట్లాడుతూ, తిరుపతిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై టీడీపీ అనుచరులు దాడులకు పాల్పడటమే కాకుం డా, అనంతరం పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం తీవ్రంగా ఖండించారు. మహిళలపై పీడీ యాక్ట్ అమలు చేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమం లో వైఎస్ఆర్‌సీపీ విశాఖపట్నం మహిళా వి భాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు, శాసనమండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తదితరులు పాల్గొన్నారు. అదనంగా సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పార్టీ రాష్ట్ర మరియు జిల్లా స్థాయి నాయకులు, మహిళా కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై నిరసనకు మద్దతు తెలిపారు.

నాయకులు ప్రభుత్వం వెంటనే మహిళలపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# గాజువాకలో మున్సిపల్ మంత్రి నారాయణ పర్యటన





- గాజువాక గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ సమస్యకు పరిష్కార మార్గం చేపడతామన్న మంత్రి
- మంత్రికి గాజువాక గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ అభివృద్ధికి చేపడుతున్న వివరాలను తెలిపిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- గాజువాకలో 4.75 ఎకరాల్లో అన్ని సదుపాయాలతో అల్లూరి సీతారామరాజు పార్కును ప్రారంభించిన మంత్రి.

**గాజువాక :పెన్ పవర్ , మార్చి 17** పారిశ్రామిక ప్రాంతం గాజువాక గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ సమస్యకు పరిష్కార మార్గం చేపడతామని, పరిసరాల నివాసితులు ఆందోళన చెందనవసరం లేదని, ప్రజల ఆహ్లాదం కోసం గాజువాక హెచ్ బి కాలనీలో 4.75 ఎకరాల్లో ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామ రాజు పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని మంత్రి నారాయణ అన్నారు . మంగళవారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వి.ఎం.ఆర్.డి.ఏ కమిషనర్ ఎన్.తేజ్ భరత్, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, టిడిపి ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, అధికారులు తో కలిసి గాజువాక జోన్ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను పరిశీలించిన అనంతరం గాజువాక 76వ వార్డు హెచ్.బి. కాలనీలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కును ప్రారంభించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ శాఖ మంత్రి మాట్లాడుతూ గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు గాజువాకలో గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో వెదజల్లుతున్న దుర్వాసన వలన ఇక్కడ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టి కి తీసుకువచ్చి పరిష్కార మార్గం చూపాలన్నారన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి స్పందిస్తూ డంపింగ్ యార్డ్ అవసరం లేకుండా ఎప్పటి చెత్త అప్పుడే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ కు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ఆధునీకరణకు ప్రణాళిక యుతంగా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కు సూచించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇక్కడ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శాఖ మంత్రి ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం 76వ వార్డు హెచ్ బి కాలనీ వద్ద అన్ని అంగులతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కును ప్రారంభించి, అందులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేశారు . పార్క్ అంతటా అందరితో కలియతిరిగి అన్ని సదుపాయాలు వసతులను పరిశీలించారు. అల్లూరి సీతారామరాజు పేరు మీద 4.75 ఎకరాలలో సుమారు రూ. 10 కోట్ల వ్యయంతో ఎంతో సుందరంగా అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన పార్కును నేడు ప్రారంభించామని తెలిపారు. పార్కులో గ్యాలరీ తో కూడిన అంపీ థియేటర్, స్కేటింగ్ రింగ్, క్రికెట్ నెట్, క్యాఫ్టేరియా, మరుగుదొడ్లు, పార్కు డ్రైనేజీ వ్యవస్థ, సెక్యూరిటీ క్యాబిన్, అల్లూరి సీతారామరాజు విగ్రహంతో నీటి ఫౌంటెన్, ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం, పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆట పరికరాలు, పచ్చదనం, ఫ్లోరింగ్ , ఆధునికరమైన అన్ని హంగులతో కూడిన జిమ్ పరికరాలు, కాంపౌండ్ వాల్ మొదలైన సౌకర్యాలతో అద్భుతంగా పార్కును నిర్మించారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని, గత ప్రభుత్వం మున్సిపల్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ప్రజలు చెల్లించిన పన్నులను ఇతర అవసరాలకు మళ్ళించిందని, ఇంకా 1700 కోట్ల రూపాయలు మున్సిపాలిటీలకు రావలసి ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మున్సిపాలిటీల నిధులు అక్కడే ఖర్చు చేసేలా గ్రీన్ ఛానల్ తీసుకువచ్చామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు 14 వేల కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచామని, రాబోయే రెండేళ్లలో మున్సిపాలిటీలలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. అంతేకాకుండా 5000 కోట్లతో పలు నగరాలలో పక్కా డ్రైన్లను నిర్మించామని, 2026- 27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నుండి వచ్చే మరో నాలుగు వేల కోట్లతో తాగునీరు, కాలువలు, రోడ్లు ,విద్యుత్తు ఏర్పాటు చేస్తామని, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టు పై రైట్స్ సంస్థతో కేంద్రం సర్వే చేయిస్తుందని, నివేదిక వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రాజెక్టును చేపడతామని ,కైలాసగిరి తరహాలో గాజువాక ప్రాంతంలో దయాళ్ నగర్ కొండ అభివృద్ధికి చేపడతామని,సమతా నగర్లో కళా ప్రాగణం అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు . .

స్థానిక శాసనసభ్యుడు పల్లా మాట్లాడుతూ గాజువాక అభివృద్ధికి అవసరమయ్యే అన్ని చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తూ, 5 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ .10 కోట్ల వ్యయంతో స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పార్కును 76వ వార్డులో ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ముఖ్యంగా 20 నెలల్లో గాజువాక ప్రాంత అభివృద్ధికి 250 కోట్లు ఖర్చు పెట్టామని, గత ప్రభుత్వంలో 5 సంవత్సరాలలో కేవలం 90 కోట్ల మాత్రమే ఖర్చు పెట్టిందని , చాలాకాలంగా ఇక్కడ ప్రజలు డంపింగ్ యార్డ్ తరలించాలని దాని వలన చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారని, డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసి ప్రజల అందరి మన్ననలు పొందగలుగుతామని శాసనసభ్యుడు ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రంలో మోడీ ప్రభుత్వం సహకారముతో ఎంతో అభివృద్ధి చేయగలుగుతున్నామని . కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలలలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని , కొంత సమయము ఇస్తే ఈ ప్రాంతానికి ఎంతో విలువ వచ్చే విధంగా రోడ్లు, కాలువలు లాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వచ్చినప్పటినుండి ప్రతి అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన మంజూరు చేస్తున్నారని తెలిపారు.

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక ప్రాంతం అభివృద్ధికి జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని, గాజువాక ప్రాంతంలో ఎప్పటినుంచో సమస్యగా ఉన్న గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు, అన్ని అంగులతో, సదుపాయాలతో, మౌలిక వసతులతో అందరినీ ఆకట్టుకునేలా గాజువాక హెచ్.బి.కాలనీలో అందమైన అల్లూరి సీతారామరాజు థీమ్ పార్క్ ను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ రెండు మూడు నెలల్లో గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ సమస్యకు పరిష్కార మార్గం చూపి ఆధునికరంతో అభివృద్ధి చేయమని, రోడ్లు, డ్రెయిన్లు, స్ట్రీట్ లైట్లు, అభివృద్ధి పరచాలని, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ మంత్రివర్యులు ఆదేశించారన్నారు. ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో జోనల్ స్థాయిలో ప్రణాళికలను రూపొందించి, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు జీవీఎంసీ యంత్రాంగం సిద్ధంగా ఉందని కమిషన తెలిపారు.

విఎంఆర్డిఏ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ గాజువాక ప్రాంతంలో ఎమ్మార్డీఏ హాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని, స్పోర్ట్స్ విలేజ్, పెదకంట్యాడలో కళ్యాణ మండపం, కళా ప్రాంగణాలు ఏర్పాటుచేసి విశాఖ నగర అభివృద్ధి దిశగా గాజువాక ప్రాంత అభివృద్ధికి విఎమ్ఆర్టిఏ కృషి చేస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, 76 వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు లు గాజువాక ప్రాంత ప్రజలకు ఈ అతిపెద్ద పార్కు ఎంతో ఉపయోగపడుతుందని, 76వ వార్డు అభివృద్ధికి ఇప్పటికే 30 కోట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంజూరు చేశారని, గాడ్ బ్లెస్ ట్రాన్స్ఫర్ స్టేషన్ సమస్యను కూడా పరిష్కరించి పరిసరాల అన్ని వాసితులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని మంత్రిని ఎమ్మెల్యేను కోరారు. కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు,రౌతు శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, స్టాలిన్, రాజాన రామారావు, మొల్లి ముత్యాలు, బొండా జగన్నాథం, ముమ్మన దేవుడు, లేళ్ళ కోటేశ్వరరావు, బొడ్డు నరసింహ పాత్రుడు, జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణరాజు ,పర్యవేక్షక ఇంజనీర్ లు రాయల్ బాబు, ఏడుకొండలు , బిజెపి ,జనసేన, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.










# ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గణబాబు దిశానిర్దేశం





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 17 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) కీలక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 52, 56, 57వ వార్డులకు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, రేషన్ సరఫరా, భద్రత వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, ఎస్.ఈ ప్రవీణ్ కుమార్, ఈ.ఈ ప్రసన్న, ఎం.ఆర్.ఓ రమేష్, పోలీస్ శాఖకు చెందిన ఏ.సి.పి, ఎస్.ఐలతో పాటు వివిధ శాఖల ఏ.ఈలు, సివిల్ సప్లైస్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అలాగే కార్పొరేటర్ రాజశేఖర్, వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు నాయకులు అజయ్, వై.టి.ఆర్, చంద్రశేఖర్, జీవ తదితరులు హాజరయ్యారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరిస్తూ, సమన్వయంతో పనిచేసి ప్రతి సమస్యను వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో స్థానికంగా ప్రజలకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# హెచ్.పీవీ వైరస్‌పై షాకింగ్ స్టడీ : ఓరల్ సెలిక్స్ ద్వారా గొంతు క్యాన్సర్

**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా క్యాన్సర్ అనగానే పొగతాగడం, మద్యం సేవించడం లేదా గుట్కా వంటి అలవాట్లు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ మారుతున్న కాలంతో పాటు వ్యాధుల కారకాలు కూడా మారుతున్నాయి. ఇటీవల వెలువడిన అంతర్జాతీయ పరిశోధనలు ఒక విస్తుపోయే నిజాన్ని వెలుగులోకి తెచ్చాయి. అదేమిటంటే, గొంతు క్యాన్సర్ రావడానికి ఇప్పుడు పొగాకు కంటే హ్యూమన్ పాపిలోమా వైరస్ (హ్యూం) ప్రధాన కారణం అవుతోంది.

**మారిన క్యాన్సర్ ముఖచిత్రం**

ఒకప్పుడు గొంతు క్యాన్సర్ బాధితుల్లో ఎక్కువ శాతం వృద్ధులు, పొగాకు వినియోగదారులు ఉండేవారు. కానీ ప్రస్తుత గణాంకాలు భిన్నంగా ఉన్నాయి. పాశ్చాత్య దేశాల్లో నమోదవుతున్న గొంతు క్యాన్సర్ కేసుల్లో సుమారు 70% నుండి 85% వరకు హెచ్.పీవీ వైరస్ వల్లే వస్తున్నాయని వైద్య నిపుణులు నిర్ధారించారు. ముఖ్యంగా హెచ్.పీవీ-16 అనే ప్రమాదకరమైన వైరస్ స్ట్రెయిన్ ఈ వ్యాధికి మూలకారణంగా మారుతోంది. ఇది గొంతులోని టాన్సిల్స్, నాలుక వెనుక భాగం మరియు గొంతు పైభాగంలోని కణజాలాన్ని ప్రభావితం చేస్తుంది.

**సన్నిహిత సంబంధాలు.. వైరస్ వ్యాప్తి**

ఈ వైరస్ వ్యాప్తి చెందే తీరుపై వైద్యులు కీలక హెచ్చరికలు జారీ చేస్తున్నారు. హెచ్.పీవీ అనేది ప్రధానంగా చర్మం నుండి చర్మం తాకడం లేదా సన్నిహిత శారీరక సంబంధాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా ఓరల్ సెక్స్ ద్వారా ఈ వైరస్ నోటిలోకి, గొంతులోకి ప్రవేశిస్తుంది. జీవితకాలంలో ఎక్కువ మంది భాగస్వాములతో సన్నిహితంగా ఉండటం వల్ల ఈ వైరస్ సోకే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశించిన వెంటనే లక్షణాలను చూపదు. దశాబ్దాల పాటు మౌనంగా ఉండి, కణాల్లో మార్పులు చేస్తూ చివరకు క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది. మహిళల కంటే పురుషులలో ఈ రకమైన క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉండటం గమనార్హం.

**నివారణ మార్గాలు: అవగాహనే ఆయుధం**

ఈ సమస్య పెరుగుతున్నప్పటికీ, భయపడాల్సిన అవసరం లేదని, ముందస్తు జాగ్రత్తలతో దీనిని అడ్డుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్యాన్సర్‌ను నివారించడానికి అందుబాటులో ఉన్న అత్యంత ప్రభావవంతమైన మార్గం వ్యాక్సిన్. ముఖ్యంగా టీనేజ్ వయస్సులోనే (9-14 ఏళ్ల మధ్య) ఈ టీకా తీసుకోవడం వల్ల భవిష్యత్తులో వచ్చే అనేక రకాల క్యాన్సర్లను అడ్డుకోవచ్చు. సన్నిహిత సంబంధాల్లో జాగ్రత్తలు పాటించడం.. భాగస్వాముల సంఖ్య పరిమితంగా ఉంచుకోవడం ద్వారా వైరస్ సంక్రమణను తగ్గించవచ్చు. గొంతులో గడ్డలు, మింగడంలో ఇబ్బంది, తగ్గని గొంతు నొప్పి లేదా గొంతు బొంగురుపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వైద్య శాస్త్రం ప్రకారం హెచ్.పీవీ సంబంధిత గొంతు క్యాన్సర్లను తొలి దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే చికిత్స కంటే నివారణే మిన్న అనే సూత్రం ఇక్కడ సరిగ్గా సరిపోతుంది. యువతలో ఈ వైరస్ పట్ల అవగాహన కల్పించడం, వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహించడం ద్వారా రాబోయే తరాలను ఈ ప్రాణాంతక వ్యాధి నుండి కాపాడుకోవచ్చు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జగన్ కి షర్మిల సవాల్...లాజిక్ తోనే !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత వైఎస్ జగన్ కి పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సరికొత్తగా సవాల్ చేశారు లాజిక్ పాయింట్ తోనే ఆమె ఈ చాలెంజ్ చేశారు అని చెప్పాలి. ఈ సవాల్ స్వీకరించి జగన్ అన్నా అని ఆమె డైరెక్ట్ గానే డిమాండ్ చేశారు. నిజానికి ఇది వైసీపీకి ఇరకాటంగా ఉండేలాగానే కనిపిస్తోంది. చెల్లెమ్మ అదను చూసి మరీ ఇచ్చిన ఈ సవాల్ షాక్ కి వైసీపీ నుంచి రియాక్షన్ ఎలా ఉంటుందో అన్న చర్చ అయితే సాగుతోంది.

**ఈసీకి వ్యతిరేకంగా :**

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ మీద ఇండియా కూటమి ఎంపీలు అంతా కలసి అభిశంసన తీర్మానం ఇచ్చారు. దాని మీద ఏకంగా 193 మంది ఎంపీలు సంతకాలు చేశారు. వీరంతా విపక్షంలోని ఎంపీలు. కేంద్ర ఎన్నికల సమంఘం ప్రధానాధికారిగా జ్ఞానేశ్వర్ పని తీరు మీద సందేహాలు వ్యక్తం చేస్తూ ఈ అభిశంసన తీర్మానం ఇచ్చారు. ఇపుడు షర్మిల జగన్ కి కోరేది ఏంటి అంటే ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ మీద విపక్షాలు మొత్తం కలిసి పెడుతున్న అభిశంసన తీర్మానానికి వైసీపీ తరపున మద్దతు ఇవ్వాలని. వైసీపీ పెద్దలు సత్తా ఉంటే ముందు ఆ పని చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**దొంగ ఏడుపులు అంటూ :**

రాష్ట్రంలో ఈవీఎంల వల్లనే తాము ఓటమి చెందామని ఎన్నికలో ఓటమి తరువాత వైసీపీ నేతలు దొంగ ఏడుపులు ఏడ్చారు కదా అని షర్మిల ఎద్దేవా చేశారు. అక్క చెల్లెమ్మల ఓట్లు ఎక్కడికి పోయాయో అని కూడా కన్నీరు పెట్టారు కదా అని ఆమె జగన్ మీద సెటైర్లు పేల్చారు. మరి ఇపుడు ఏకంగా ఈసీ మీదనే అభిశంసన తీర్మానం ప్రవేశపెడుతున్నపుడు వైసీపీకి మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం ఏముంటుందని ఆమె ప్రశ్నించారు.

**చిత్తశుద్ధి ఉంటే :**

ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలు ఎన్నుకున్నది కాదని ఈవీఎంలతో ఏర్పడింది అని వైసీపీ నేతలు విమర్శిస్తూ వస్తున్నారు కదా ఇపుడు ఈసీ మీద అభిశంసన తెలియచేసే అవకాశాన్ని ఎందుకు వాడుకోరని ఆమె నిలదీశారు. నిజంగా వైసీపీకి చిత్త శుద్ధి ఉంటే ఇండియా కూటమి తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. తాను మోడీకి దత్తపుత్రుడు కాను అని నిరూపించుకునేందుకు అయినా జగన్ ఈసీకి వ్యతిరేకంగా విపక్షాలు ఇచ్చిన తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఆమె సలహా ఇచ్చారు.

కేంద్ర ఎన్నికల సంఘం విపక్షాలను ఇబ్బందులు పెడుతూ రాజ్యంగానికి విరుద్ధమైన తీరులో వ్యవహరిస్తోంది అని షర్మిల మండిపడ్డారు. మొత్తానికి షర్మిల చేసిన ఈ డిమాండ్ మీద వైసీపీ పెద్దలు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది. ఇది ఎపుడూ వైసీపీని జగన్ ని విమర్శించినట్లుగా షర్మిల చేయలేదు, ఒక ఇష్యూని ముందు పెట్టి వైసీపీని ఇరకాటంలో పెట్టారు. దాంతో అంతా వైసీపీ ఏమి చేయబోతోంది అని ఎదురుచూస్తున్నారు.

## మరోసారి బాబు పవన్-ఉత్కంఠ రేపుతున్న భేటి

**హైదరాబాద్ పెన్ పవర్:** కేవలం పదిహేను రోజుల తేడాలో మరోసారి టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భేటీ కాబోతున్నారు. చంద్రబాబుని ఆయన నివాసంలో బుధవారం పవన్ కలవబోతున్నారు అని అంటున్నారు. ఈ భేటీలో ఏ ఏ అంశాలు చర్చకు వస్తాయి అన్నది అంతటా చర్చ సాగుతోంది. ఈ నెల 3న చంద్రబాబు పవన్ ల భేటీ ఉండవల్లి నివాసంలో జరిగింది. మళ్ళీ ఇంత త్వరగా భేటీ జరగడం పట్ల అయితే ఆసక్తి నెలకొంది.

ఇదిలా ఉంటే ఈ భేటీలో తాజా రాజకీయ పరిణామాలు చర్చకు వస్తాయని అంటున్నారు. అంతే కాదు నామినేటెడ్ పదవులతో పాటు ఇతర అంశాలు కూడా చర్చకు వచ్చే ఆస్కారం ఉందని భావిస్తున్నారు. ఇక మంత్రి వర్గ విస్తరణ తొందరలో ఉంటుందని భావిస్తున్న క్రమంలో దాని మీదనే సోషల్ మీడియా మెయిన్ స్ట్రీమ్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతున్న క్రమంలో ఆ అంశాలు కూడా చర్చకు వస్తాయని అంటున్నారు.

**పుట్టా ఇష్యూ సైతం :**

ఇక ఏపీలో హాట్ హాట్ డిస్కషన్ పాయింట్ గా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ ఇష్యూ ఉందని అంటున్నారు. దాంతో దీని మీద ఇప్పటికే టీడీపీ అధినాయకత్వం షోకాజ్ నోటీసుని ఆయనకు జారీ చేసింది. వివరణ ఇచ్చేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. అయితే ఈ విషయం మీద వైసీపీ అయితే రాజకీయ రచ్చ చేస్తోంది. దాంతో దీని మీద కూడా ఈ ఇద్దరి భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు అలాగే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఇష్యూ మీద అయితే వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టింది. దాంతో ఈ విషయం మీద కూడా చర్చిస్తారా అన్నది కూడా ప్రచారంలో ఉంది.

**స్థానిక సంస్థల గురించి :**

ఇక ఏపీలో చూస్తే మున్సిపాలిటీలు, కార్పోరేషన్లకు పదవీ కాలం ముగిసింది. పంచాయతీలకు తొందరలో ముగియబోతోంది. దాంతో స్థానిక సంస్థల ఎన్నికల గురించి కూడా చర్చిస్తారా అన్నది కూడా అనుకుంటున్నారు. అలాగే స్థానిక ఎన్నికలను సాధ్యమైనత త్వరగా నిర్వహించాలని కూటమి పార్టీలకు క్యాడర్ నుంచి ఒత్తిడి వస్తోంది. దాంతో ఈ ఇష్యూ కూడా కీలకంగా మారుతోంది. ఇక చూస్తే రెండు రోజుల పాటు జరిగిన కలెక్టర్ల సదస్సుకు, అలాగే తాజాగా జరిగిన మంత్రి వర్గ సమావేశానికి పవన్ హాజరు కాలేదు. దాంతో ఈ ఇద్దరు నేతలు కలిస్తే అనేక అంశాల గురించి చర్చకు రావచ్చు అని అంటున్నారు. మొత్తానికి చూస్తే సరిగ్గా ఉగాదికి ఒక రోజు ముందు కూటమి పెద్దలు ఇద్దరూ భేటీ కాబోతున్నారు అంటే మ్యాటర్ ఏంటో అన్న ఆసక్తి అయితే అంతటా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఏ ఇష్యూస్ ని చర్చిస్తారో .

## కూటమి పుట్టలో ఎంతో మంది...అయినా నో యాక్షన్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి రాజకీయ ఆయుధాలు దొరుకుతున్నాయి. కూటమి నేతలు వరసగా ఇబ్బందులో పడుతూంటే వైసీపీ అంతే ధీటుగా వాటిని అందిపుచ్చుకుంటోంది. ఇక ఈ మధ్య కాలంలో అయితే ఏదో ఒక విషయం మీద కూటమిని ఇబ్బంది పెట్టే ప్రయత్నంలో వైసీపీ బిజీగా ఉంది అని అంటున్నారు. ఏలూరు ఎంపీ టీడీపీకి చెందిన యువ నాయకుడు పుట్టా మహేష్ యాదవ్ హైదరాబాద్ లో డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడంతో వైసీపీ దాని మీద గట్టిగానే పట్టు బిగుస్తోంది. పుట్టా మొదలుకుని ఎందరో ఎన్నెన్నో అంటూ ఏకంగా వైసీపీ అధినేత జగన్ లిస్ట్ చెబుతూ కూటమికి షాకిస్తున్నారు.

**తొలి టీడీపీ ఎంపీగా రికార్డు :**

కూటమి ప్రభుత్వం లో ఎంపీగా ఉంటూ దేశంలోనే ఒక సరికొత్త రికార్డుని పుట్టా మహేష్ యాదవ్ నెలకొల్పారని జగన్ విమర్శించారు. ఇప్పటిదాకా దేశ చరిత్రలో ఏ ఎంపీ కూడా ఈ విధంగా డ్రగ్స్ కేసులో నేరుగా పట్టుబడలేదని ఆయన గుర్తు చేశారు. ఇంత జరిగినా టీడీపీ పెద్దలు ఏమి చర్యలు తీసుకుంటున్నారు అంటే నో యాక్షన్ అని జగన్ ఎద్దేవా చేశారు.

**వీరి సంగతేంటి :**

ఏపీలో కూటమి ఎమ్మెల్యేలు అరవై శ్రీధర్ ఆదిమూలం సురేష్ సహా ఎంతో మంది మీద ఆరోపణలు వచ్చినా కూడా కూటమి పెద్దలు కనీసమాత్రంగా అయినా చర్యలు తీసుకోలేదని జగన్ ఆక్షేపించారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ మరో గుంటూర్ ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ల మీద ఆరోపణలు వచ్చినా చంద్రబాబు పట్టించుకోలేదని జగన్ విమర్శించారు. బాబు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం వల్లనే కూటమి ప్రజా ప్రతినిధులు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు అని మండిపడ్డారు. ఆ వీడియోలు అన్నీ వైరల్ అవుతున్నాయని కంటికి కంబడుతున్నా బాబు ఏమీ యాక్షన్ తీసుకోలేదని జగన్ ఫైర్ అయ్యారు.

**వీటికి పరాకాష్ట :**

ఆఖరికి ఒక మంత్రి పీఏ మహిళా ఉద్యోగి మీద లైంగిక వేధింపులకు పాల్పడినా బాబు ఏమీ చేయలేకపోయారు అని జగన్ హాట్ కామెంట్స్ చేశారు. వీటికి పరాకాష్ట ప్రస్తుత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మీద ఆరోపణలు వచ్చినా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కొడుకు డ్రగ్స్ తీసుకుని పట్టుబడినా నో యాక్షన్ అన్నట్లుగా కూటమి పెద్దల తీరు ఉందని జగన్ విమర్శించారు. ఇక నారా లోకేష్ మీద జగన్ ఆరోపణలు చేశారు. స్విమ్మింగ్ పూ లో డ్యాన్సులు వేసినా యాక్షన్ లేదని అమ్మాయిలు కనిపిస్తే ఏదో ఒకటి చేయాలన్న బాలయ్య మీద యాక్షన్ లేదని ఇదీ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీరు అని జగన్ ఘాటుగా విమర్శించారు.

## ప్రశాంత్ కిషోర్ సైలెంట్.. పీకే వ్యూహాలకు డిమాండ్ తగ్గిందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ వ్యవహారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. గతంలో దేశంలో ఎక్కడ ఎన్నిక జరిగినా ప్రశాంత్ కిషోర్ ప్రస్తావన ఎక్కువగా ఉండేది. పార్టీలు, బడా నేతలు ఆయన నుంచి రాజకీయ వ్యూహాలను ఆశించేవారు. 2014 సార్వత్రిక ఎన్నికల నుంచి దేశ రాజకీయాల్లో ప్రశాంత్ కిషోర్ హవాయే నడిచింది. ఆయన వ్యూహాలతో చాలా రాష్ట్రాల్లో అధికారం చేతులు మారిందని, నేతల తలరాత తారుమైరందని ప్రచారం జరిగింది. అయితే 2014 తర్వాత ఫస్ట్ టైం ప్రశాంత్ కిషోర్ ప్రస్తావన లేకుండా దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్నాయి. 2014లో ప్రధాని మోదీ కోసం పనిచేయడం ద్వారా ప్రశాంత్ కిషోర్ దేశంలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2014లో ప్రధాని మోదీ తరపున పనిచేసిన ప్రశాంత్ కిషోర్ ఆ తర్వాత దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రముఖ పార్టీలకు వ్యూహాలను అందించారు. ఏపీలో వైసీపీ, తమిళనాడులో డీఎంకే, పశ్చిమబెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ ఇలా ఆయన పనిచేసిన పార్టీలు అన్నీ ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో ఘన విజయం సాధించాయి. దీంతో ప్రశాంత్ కిషోర్ కు దేశవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో తన సొంత రాష్ట్రం బిహార్ లో ప్రత్యేకంగా జన సురాజ్ పేరుతో ప్రశాంత్ కిషోర్ పార్టీని ప్రారంభించారు.

గత ఎడాది జరిగిన ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ పార్టీ ఘోరంగా ఓటమి చెందింది. దీంతో ప్రశాంత్ కిషోర్ క్రేజ్ అమాంతంగా పడిపోయిందని అంటున్నారు. ఈ కారణంగానే ప్రస్తుత ఎన్నికల్లో ఆయన వ్యూహాలను ఎవరూ కోరుకోవడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ గతంలో పనిచేసిన తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు కానీ, అధికారం ఆశిస్తూ ఎన్నికల రణ క్షేత్రంలోకి దిగిన పార్టీలు కానీ ప్రశాంత్ కిషోర్ వ్యూహాల కోసం ప్రయత్నించిన దాఖలాలు కనిపించడం లేదు. తమిళనాడులో కొత్తగా ప్రారంభించిన టీవీకే పార్టీ మొదట్లో ప్రశాంత్ కిషోర్ ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. అయితే బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆ పార్టీ కూడా ప్రశాంత్ కిషోర్ తో చర్చలను నిలిపివేసినట్లు చెబుతున్నారు. ప్రశాంత్ కిషోర్ తో పనిచేయించుకోవాలంటే చాలా ఖరీదైన వ్యవహారమని, కానీ ఆయన వ్యూహాలు మాత్రం ఎందుకు పనిచేయవని బిహార్ ఎన్నికలతో తేలిపోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. గెలిచే పక్షాన్ని ఎంచుకుని లాభపడటం తప్ప, ప్రశాంత్ కిషోర్ చేసింది, చేయగలిగింది ఏమీ లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ కారణంగానే ప్రస్తుత ఎన్నికల్లో అన్ని పార్టీలు ప్రశాంత్ కిషోర్ ను దూరం పెట్టినట్లు చెబుతున్నారు.

# టీమిండియా టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్ గెలిచి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ విజయంతో టీమిండియాకి ఐసీసీ ట్రోఫీ అందించిన కెప్టెన్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ చేరాడు. ఈ టోర్నమెంట్ తర్వాత అతడు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుంటాడని, ఆటకు వీడ్కోలు పలికే ఛాన్స్ ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. న్యూజిలాండ్ పై ఫైనల్లో గెలిచిన తర్వాత ఒలింపిక్స్-2028లో ఆడటమే తన లక్ష్యమని ఇప్పటికే సూర్య క్లియర్ గా చెప్పేశాడు. కెప్టెన్సీ వ్యవహారంపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఇండియన్ టీమ్ టీ20 కెప్టెన్ గా ఎవరూ ఊహించని పేరును ప్రతిపాదించాడు. జట్టులో చోటే లేని ప్లేయర్ కి జట్టు టీమ్ పగ్గాలు ఇవ్వాలని చెప్పడం గమనార్హం. కాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో కోల్‌కతా నైట్‌రైడర్స్ కి టైటిల్ అందించిన కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ నిలిచాడు. గతేడాది పంజాబ్ కింగ్స్ కి వెళ్లిన ఈ ముంబై బ్యాటర్.. ఆ జట్టును ఫైనల్ వరకు తీసుకెళ్లాడు. సారథిగా, బ్యాటర్ గా రాణించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అయినప్పటికీ శ్రేయస్ ని సెలక్టర్లు పెద్దగా పట్టించుకోలేదు.. అతడు ఫామ్ లో ఉన్నప్పటికీ.. టీమ్ లో మాత్రం చోటు ఇవ్వలేకపోతున్నామని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తేల్చి చెప్పారు. ఆసియా టీ20 కప్-టోర్నీకి జట్టుని ప్రకటించిన సందర్భంగా ఈ కామెంట్స్ చేశారు. ఇక టీ20 వరల్డ్ కప్ -2026 జట్టులోనూ అయ్యర్ కి స్థానం లభించలేదు.

దేశీయ లీగ్స్, ఐపీఎల్లో సత్తా చాటిన శ్రేయస్ అయ్యర్ ని బీసీసీఐ సెలక్షన్ కమిటీ పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి సమయంలో ఆకాశ్ చోప్రా మాత్రం అయ్యర్ భారత జట్టు టీ20 కెప్టెన్ ఎందుకు కాకూడదంటూ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఐపీఎల్-2026లో పంజాబ్ కింగ్స్ సారథిగా, బ్యాటర్ గా

రాణిస్తే అతడికి మరో ఛాన్స్ దక్కుతుందని అన్నారు. శ్రేయస్ టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్ లో ఉంటాడని నేను అనుకున్నాను.. మిడిలార్డర్ లో ఒకవేళ చోటు ఖాళీ అయితే కచ్చితంగా అది అతడికే దక్కేది అన్నారు. కాబట్టి త్వరలోనే శ్రేయస్ అయ్యర్ భారత టీ20 జట్టులోకి వచ్చే ఛాన్స్ కనిపిస్తుందన్నారు. ఇక కెప్టెన్సీ విషయానికొస్తే.. ఇండియన్ టీమ్ తదుపరి కెప్టెన్ గా శ్రేయస్ ఎందుకు ఉండకూడదు? అందుకు అవకాశం ఉందని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు.

# ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్.. టికెట్ల అమ్మకం షెడ్యూల్ రిలీజ్









**హైదరాబాద్ పెన్ పవర్:** మార్చి 28 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 మొదటి దశలో సొంతగడ్డపై జరిగే మ్యాచ్‌ల టిక్కెట్ల అమ్మకాల షెడ్యూల్‌ను ముంబై ఇండియన్స్ (మార్చి 17న) విడుదల చేసింది. బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ముంబై ఇండియన్స్ తొలి దశలో మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో హోమ్ మ్యాచ్‌తో తమ జర్నీని స్టార్ట్ చేయనుంది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పై ఇతర వేదికల్లో మ్యాచ్‌లను ఆడనుంది. ఆ తర్వాత మళ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే కీలక మ్యాచ్ ని వాంఖడే స్టేడియంలో ఆడనుంది. ఈ మ్యాచులకి సంబంధించిన టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో దీశీశీనివీమాష్ట్రశీష వెబ్‌సైట్, యాప్ ద్వారా ఎం-టికెట్ల రూపంలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈసారి టికెట్ల విక్రయాన్ని నాలుగు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో గూగుల్ పే ఉపయోగించే వినియోగదారులకు మార్చి 19 మధ్యాహ్నం 12 గంటల నుంచి మార్చి 21 మధ్యాహ్నం 12 గంటల వరకు టికెట్లు బుక్ చేసుకునే ఛాన్స్ కల్పించారు. రెండో దశలో ఎంఐ గోల్డ్, సిల్వర్, జూనియర్ మెంబర్లకు మార్చి 21 మధ్యాహ్నం 3 గంటల నుంచి మార్చి 22 మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

మూడో దశలో ఎంఐ బ్లూ మెంబర్లు, ముందుగా రిజిస్టర్ చేసుకున్న దీశీశీనివీమాష్ట్రశీష యూజర్లకు మార్చి 22వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి మార్చి 23 సాయంత్రం 5 గంటల వరకు టికెట్లు అందుబాటులో ఉంటాయి. చివరి దశలో సాధారణ ప్రజలకు మార్చి 23వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి టికెట్ విక్రయం ప్రారంభమవుతుంది. మెంబర్‌షిప్ ద్వారా ముందస్తు బుకింగ్ సదుపాయం పొందాలంటే, మార్చి 19వ తేదీ రాత్రి 11:59 లోపు మెంబర్‌షిప్ తీసుకోవాలని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ స్పష్టం చేసింది. అభిమానులకు ప్రాధాన్యత కల్పించేందుకు ఈ విధంగా దశలవారీగా టికెట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే ప్రాక్టీస్ క్యాంప్‌ను స్టార్ట్ చేసింది.

# రాహుల్ ద్రవిడ్ డ్యాన్స్ సూపర్.. నన్ను పార్టీకి పిలవకపోయినా వెళ్లాను..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు భారత మాజీ ఫాస్ట్ బౌలర్ శ్రీశాంత్ తన క్రికెట్ కెరీర్‌లో జరిగిన ఆసక్తికర సంఘటనలను షేర్ చేసుకున్నాడు. ముఖ్యంగా టీమిండియా చేసుకునే పార్టీల గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. శ్రీశాంత్ మాట్లాడుతూ.. తమ కాలంలో మ్యాచ్‌లు గెలిచిన తర్వాత ప్లేయర్స్ ఎక్కువగా నైట్ పార్టీల్లో పాల్గొనేవారని చెప్పాడు. సీనియర్ ఆటగాళ్లు మాత్రం త్వరగా నిద్రపోవడాన్ని ఇష్టపడేవారని గుర్తు చేశాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ లాంటి వారు త్వరగా నిద్రపోతారు.. కానీ సౌరభ్ గంగూలీ మాత్రం ఎక్కువగా తన గదిలోనే ఉండేవాడు.. భారీ విజయాలు సాధించినప్పుడు మాత్రం అందరం కలిసి సెలబ్రేట్ చేసుకునేవాళ్లమని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు. పాకిస్థాన్‌లోనే పాక్ పై సిరీస్ గెలిచిన సందర్భాన్ని మాజీ క్రికెటర్ శ్రీశాంత్ గుర్తు చేసుకుంటూ.. ఆ సిరీస్ నా ఫస్ట్ విదేశీ టూర్.. ఆ రోజు మాత్రం అందరం కలిసి రాత్రి పొద్దుపోయే వరకు ఎంజాయ్ చేశాం.. ఈ సందర్భంగా రాహుల్ ద్రవిడ్ గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. రాహుల్ భాయ్ చాలా బాగా డాన్స్ చేస్తాడు.. ఇది చాలా మందికి తెలియదన్నాడు. మైదానంలో కూల్‌గా, క్రమశిక్షణతో కనిపించే ద్రవిడ్‌కు ఈ టాలెంట్ ఉందని చెప్పడంతో ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు, 2008 ఐపీఎల్ ఫైనల్ తర్వాత జరిగిన పార్టీకి నన్ను ఆహ్వానించలేదు, అయినప్పటికీ నేను వెళ్లినట్ల శ్రీశాంత్ గుర్తు చేసుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ తర్వాత పార్టీ జరిగింది.. ఆ పార్టీకి నాకు ఆహ్వానం లేకపోయినా 'పర్పుల్ క్యాప్' కోసం వెళ్లాను.. షేన్ వార్న్ లాంటి లెజెండ్స్ అక్కడ ఉండడంతో నేను కూడా పార్టీలో పాల్గొన్నట్లు తెలిపాడు. ఆ సీజన్‌లో శ్రీశాంత్ 19 వికెట్లు తీసుకోగా, పాకిస్థాన్ బౌలర్ సోహైల్ తన్వీర్ 22 వికెట్లతో పర్పుల్ క్యాప్ దక్కించుకున్నాడు. 2008లో రాజస్థాన్ రాయల్స్ జట్టు షేన్ వార్న్ నాయకత్వంలో టైటిల్ గెలుచుకుంది.

# శంకర్ మళ్లీ లైఫ్ రిస్క్ ప్రాజెక్ట్ చేస్తున్నాడా?



నభా నటేష్ ఎప్పుడూ మీ కలల్లోనే ఉంటుంది





జాన్వీ కపూర్ ఆరాధన కంటే తక్కువ కాదు

ఇండస్ట్రీలో ఎవరి లైఫ్ ఎలాంటి టర్న్ తీసుకుంటుందో ఎలాంటి మలుపులు, కుదుపులకు లోనవుతుందో చెప్పడం కష్టం. ఇప్పుడు అలాంటి ఇబ్బందికర పరిస్థితుల్నే ఎదుర్కొంటున్నారు స్టార్ డైరెక్టర్ శంకర్. తనదైన మార్కు భారీ బడ్జెట్ సినిమాలతో కోలీవుడ్, టాలీవుడ్‌లలోనే కాకుండా దేశ వ్యాప్తంగా మంచి పాపులారిటీని సొంతం చేసుకుని ఇండియన్ టాప్ డైరెక్టర్లలో ఒకరిగా ఎదిగిన ఆయన ఇప్పుడు మాత్రం చాలా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. -రోబో- వరకు సాఫీగానే సాగిన శంకర్ ప్రయాణం చియాన్ విక్రమ్‌తో చేసిన -ఐ- నుంచి దారి తప్పుతూ కుదుపులకు గురవుతోంది.

భారీ అంచనాల మధ్య చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచి శంకర్‌కు షాక్ ఇచ్చింది. ఈ మూవీ ఇచ్చిన షాక్‌కి ఆస్కార్ ఫిల్మ్స్ వి.రవిచంద్రన్ మరో సినిమా చేయలేకపోయారు. కమల్‌తో కలిసి సహ భాగస్వామిగా -విశ్వరూపం- రెండు భాగాలని నిర్మించినా సోలో ప్రొడ్యూసర్‌గా మాత్రం ప్రొడక్షన్ ఆపేసి షాక్ ఇచ్చారు. ఇక ఈ మూవీ తరువాత లైకా ప్రొడక్షన్‌తో కలిసి చేసిన -2.ఓ- ఫరవాలేదు అనిపించినా ఆశించిన లాభాల్ని మాత్రం తెచ్చి పెట్టలేకపోయింది. ఇదే సంస్థలో కలిసి శంకర్ చేసిన -ఇండియన్ 2- వివాదం ఇప్పటికీ శంకర్‌ని వెంటాడుతూనే ఉంది. ఈ సినిమా షూటింగ్ సమయంలో క్రేన్ యాక్సిడెంట్ జరగడం, అందులో డైరెక్షన్ టీమ్‌కు సంబంధించి నలుగురు వ్యక్తులు మృతి చెందడంతో శంకర్‌కు, లైకాకు మధ్య వివాదం ముదిరి సినిమా ఆగిపోయే దాకా వచ్చింది. -విక్రమ్- సక్సెస్ తరువాత ఉదయనిధి స్టాలిన్‌ని ఒప్పించిన కమల్ లైకా, శంకర్‌ల మధ్య సయోధ్య కుదిర్చి -ఇండియన్ 2-ని పూర్తి చేసి రిలీజ్ చేయించాడు. ఫలితం డిజాస్టర్. ఇదే డిజాస్టర్ అనిపించుకుంటే దీనికి సీక్వెల్ గా -ఇండియన్ 3-ని కూడా అప్పటికే మొదలు పెట్టి మధ్యలో ఆపేశారు. ఇప్పుడు దీన్ని పూర్తి చేసి ఓటీటీకి ఇవ్వడం శంకర్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. దీనిపై లైకా వర్గాలు ఇప్పటికీ శంకర్‌పై గుర్రుగానే ఉన్నారు. దీన్ని పూర్తి చేయకుండా శంకర్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ -వేల్పరి-ని పట్టాలెక్కించాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. అది అంత ఈజీ కాదని తెలుస్తోంది. -ఇండియన్ 3-ని పూర్తి చేయకుండా శంకర్ -వేల్పరి-ని స్టార్ట్ చేస్తే లీగల్ గా ప్రొసీడ్ అవుతామని లైకా వర్గాలు బాహాటంగానే హెచ్చరిస్తున్నాయి. ఈ వివాదాం సద్దుమనగాలంటే శంకర్ -ఇండియన్ 3-ని పూర్తి చేయాల్సిందే. దాన్ని పూర్తి చేసి -వేల్పరి-ని మొదలు పెట్టాలంటే ప్రొడ్యూసర్ ఎవరన్నది ఇప్పుడు శంకర్‌కు ప్రధాన సమస్యగా మారింది. అంతే కాకుండా ఈ ప్రాజెక్ట్‌కు కమిట్ అయ్యే హీరోలు రెండేళ్లు డేట్స్ ఇవ్వాల్సిందే. అలా డేట్స్ ఇచ్చే పరిస్థితిలో ఏ హీరో కనిపించడం లేదు. శంకర్ కాబట్టి ధనుష్ డేట్స్ ఇచ్చే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ధనుష్ ఇప్పటికే వరుస ప్రాజెక్ట్‌లని ప్రకటించాడు. ఇళయరాజా బయోపిక్‌తో పాటు అబ్దుల్ కలాం బయోపిక్ కూడా లైన్‌లో ఉంది. అంతే కాకుండా తన 55వ ప్రాజెక్ట్‌ని ఇటీవలే మొదలు పెట్టాడు. అది పూర్తి చేయాలి. -వేల్పరి- ఛారిత్రక నేపథ్యంలో సాగు పీరియాడిక్ మూవీ దీనికి భారీ సెట్స్ తో పాటు భారీ బడ్జెట్ చాలా అవసరం. శంకర్ ప్రస్తుత రికార్డ్‌ని బట్టి ఇంత వరకు ఏ ప్రొడ్యూసర్ కూడా ముందుకు రాలేదు. దీంతో శంకర్ -వేల్పరి- అంటూ మరో తలనొప్పిని నెత్తికి ఎత్తుకుంటున్నాడని కోలీవుడ్‌లో కామెంట్‌లు వినిపిస్తున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965